ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	40.0	30.0
కావలి	38	29
ఆత్మకూరు	40	30
ఉదయగిరి	39	28
కందుకూరు	39	28





'క్వార్ట్జ్' కేసులో పోలీసుల దూకుడు

- మరో 11 మందికి నోటీసులు
- సుప్రీంకోర్టులో కాకాణి స్పెషల్ లీవ్ పిటిషన్
- బెంగళూరు, హైదరాబాదుకు ప్రత్యేక బృందాలు
- శ్రీలంకకు వెళ్లనున్న మరో బృందం

నెల్లూరు (క్రైం), మే 15 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు మండలంలోని రుస్తుం మైన్స్‌లో అక్రమంగా క్వార్ట్జ్ ఖనిజం కొల్లగొట్టిన కేసులో పోలీసులు దూకుడు పెంచారు. ఈ కేసులో మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఏ4గా చేర్చిన పోలీసులు నెలల తరబడి గాలిస్తున్నా ఆయన జాడ మాత్రం దొరకడం లేదు. ఈ క్రమంలోనే ఈ కేసులో మరో 11 మందికి ఈ నెల 12 నుంచి పోలీసులు నోటీసులు అందించారు. వారిని 13 నుంచి 18వ తేదీలోపు విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. అయితే ఇప్పటికే పలువురు విచారణకు హాజకు కాకపోవడం, పలుమార్లు నోటీసులు ఇస్తున్నా పట్టించుకోకపోవడంతో వారిపై చట్టపరంగా ముందుకు వెళ్లేందుకు పోలీసులు అడుగులు వేస్తున్నారు.

● 11 మందికి నోటీసులు

రుస్తుం క్వార్ట్జ్ కేసులో పోలీసులు మరో 11 మందికి నోటీసులు అందించారు. వాకాటి శ్రీనివాసులురెడ్డి, దువ్వూరు సుప్రజ, ప్రభాకర్‌రెడ్డి, ఎం గోపాలకృష్ణారెడ్డి, బత్తుల సురేష్‌కుమార్‌రెడ్డి, ఎం వెంకటశేషయ్య, బిరదవోలు మహేంద్ర, పెంచల రెడ్డి, శేఖర్, సుమంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డిలకు నోటీసులు జారీ చేశారు. అయితే నోటీసులు అందించడానికి పోలీసులు వెళ్లిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇంటి తలుపులకు నోటీసులు అంటించి వచ్చారు. నోటీసులు అందుకున్న వారు కూడా విచారణకు హాజరు కాకపోవడంతో వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కాకాణి ప్రధాన అనుచరుడు మందల వెంకటశేషయ్య శుక్రవారం పోలీసుల విచారణకు హాజరు కావాల్సి ఉంది.

● రాష్ట్రాలు, దేశాలు దాటి గాలింపు

క్వార్ట్జ్ కేసులో ముద్దాయిగా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోసం జిల్లా పోలీసులు పలు రాష్ట్రాలలో గాలింపు చర్యలు చేపడుతున్నారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలు బృందాలు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపడుతున్నారు. అయినా కాకాణి జాడ తెలిలేదు. ఈ క్రమంలో శ్రీలంకలో కాకాణి ఉన్నాడన్న సమాచారం రావడంతో అక్కడకు ఓ ప్రత్యేక బృందం వెళ్లనున్నట్లు తెలిసింది. మరోవైపు కాకాణి బెయిల్ కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కోర్టులో ఎదురుదెబ్బ తగలడంతో ఆయన సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్‌ను బెయిల్ కోసం వేశారు. ఇక ఈ కేసులో ఎ-7, ఎ-8గా ఉన్న వారు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించగా ఈ నెల 19వ తేదీకి వాయిదా వేశారు. ఎ-6 బెయిల్ పిటీషన్‌పై ఎస్సీఎస్టీ కోర్టు వచ్చేవారం విచారణ అంటూ తీర్పు ఇచ్చింది.



మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్సీ బీద, ఎమ్మెల్యే కోటంరెడ్డిలను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

పొట్టేపాళెం, ములుముడి కలుజుల వద్ద వంతెనలు నిర్మిస్తాం

- త్వరలో నిధులు విడుదల చేస్తాం
- డిసెంబరు కల్లా యూడీఎస్, తాగునీటి పనుల పూర్తి
- రాష్ట్ర మంత్రి నారాయణ వెల్లడి
- 26 డివిజన్లలో 339 అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు


8

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలి : కలెక్టర్

నెల్లూరు (విద్య) : ఈ నెల 19 నుంచి జరగనున్న టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో గురువారం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేస్తూ అన్ని కేంద్రాల్లో నిరంతర విద్యుత్, ప్రథమ చికిత్స శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి కేంద్రంలో మంచినీరు వసతి, పోలీస్ బందోబస్తు, 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసి, ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని తెలిపారు. డీఈఓ బాలాజీరావు మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి 12.45 వరకు పరీక్షలు జరుగుతాయని, జిల్లావ్యాప్తంగా 38 కేంద్రాల్లో 5,422 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. అలాగే 19 నుంచి 24వ తేదీ వరకు ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు కూ డా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ఐఓ వరప్రసాద్ రావు పాల్గొన్నారు.

భోక్తలకే 'సహకారం'!

డీసీసీబీలో మొండిబకాయిలు రూ.150 కోట్లు



నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో 24 బ్రాంచీలు ఉన్నాయి. ఈ బ్రాంచ్ పరిధిలో ఏటా రూ.1800 కోట్ల వరకు రైతులకు రుణాల రూపంలో ఇస్తున్నారు. ఇంత సామర్థ్యం కలిగిన ఈ బ్యాంకును కొందరు అవినీతిపరులు కొల్లగొట్టేస్తున్నారు. ఆర్థిక సామర్థ్యాన్ని కుళ్లబొడిచేస్తున్నారు.

● వ్యవసాయ మొండి బకాయిలు

నాయుడుపేట నియోజకవర్గ పరిధిలోని చిట్టమూరు సొసైటీలో రూ. 30 కోట్ల వరకు మొండి బకాయిలు ఉన్నాయి. ఉదయగిరి పరిధిలోని కమ్మపాలెం సొసైటీ రూ.11 కోట్లు, వింజమూరు పరిధిలోని కుడుములదిన్నె సొసైటీ రూ.7కోట్లు, వెంకటగిరి సొసైటీ రూ.11 కోట్లు, ఉదయగిరి మండలం కమ్మవారిపాలెం సొసైటీ రూ.8 కోట్లు.. ఇలా డీసీసీబీ పరిధిలోని పలు సొసైటీలన్నింటిలో కలిసి సుమారు 80 కోట్ల వరకు మొండి బకాయిలుగా పేరుకుపోయాయి. వీటిలో సుమారు రూ.40 కోట్ల వరకు ఇక రావని నిర్ధారించుకొని నిరర్థక ఆస్తులుగా ప్రకటించారు. మిగిలిన 40 కోట్లు కూడా వస్తాయన్న గ్యారెంటీ లేదు. నిజమైన రైతులకు ఇచ్చిన రుణాల విషయంలో ఢోకా లేదు. అవి వసూళ్ళు అయిపోతున్నాయి. బినామీ పేర్లతో నాయకులు, సిబ్బంది భోంచేసిన అప్పులు మాత్రం తిరిగి రావడం లేదు. వీటిని వసూలు చేయాలనే తాపత్రయం డీసీసీబీ యంత్రాంగంలో కనిపించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

● మైక్రో ఫైనాన్స్ రుణాల పేరుతో..

డ్వాక్రా మహిళలకు భారీగా రుణాలు ఇప్పించి మంచి మార్కులు కొట్టేయాలనే ఉద్దేశంతో గత వైసీపీ ప్రభుత్వం డీసీసీబీలపై తీసుకొచ్చిన ఒత్తిడి ఆ శాఖలో పనిచేసే క్షేత్రస్థాయి ఉద్యోగులకు వరంగా మారింది. దీంతో డ్వాక్రా మహిళల పేరు చెప్పి ఏకంగా రూ.65 కోట్లు పక్కదారి పట్టించారు. ఈ పాపంలో ఆ శాఖలోని అన్నిస్థాయిల అధికారుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా డీసీసీబీలో భూమి కలిగిన రైతులకే రుణాలు ఇస్తారు. ఒకవేళ వారు తీసుకున్న రుణం చెల్లించని పక్షంలో భూమిని వేలం వేయడం ద్వారా రికవరీకి ఆస్కారం ఉంటుంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం కొత్తగా డ్వాక్రా మహిళలకు వ్యవసాయ అనుబంధ వ్యాపారాల కోసం మైక్రో ఫైనాన్స్ ఇవ్వమని డీసీసీబీలపై ఒత్తిడి తెచ్చి టార్గెట్లు విధించింది. దీంతో సొసైటీల పరిధిలోని కార్యదర్శులు ఏడాపెడా రుణాలు మంజూరు చేశారు. ఈ రుణాలు తిరిగి చెల్లించే పనిలేదని డ్వాక్రా మహిళలకు నచ్చజెప్పి వారి చేత సంతకాలు చేయించుకొని రుణ మొత్తాలను వీరు భోంచేశారు. ఇంకొంత డ్వాక్రా మహిళలకు తెలియకనే వారి పేర్ల మీద రుణ మొత్తం తీసి జేబులో వేసుకున్నారు. కొంతమంది నిజమైన లబ్ధిదారులకు రుణాలు అందినా ఎవరూ తిరిగి చెల్లించడం లేదు కాబట్టి మనమెందుకు చెల్లించాలి అని మిన్నకుండిపోయారు. దీంతో ఈ పథకం కింద ఇచ్చిన రూ.65 కోట్లు మొండి బకాయిలుగా మిగిలిపోయి నిరర్థక రుణాల పద్దులో కలిసేందుకు సిద్ధంగా ఉన్నాయి.

● డీసీసీబీపై తీవ్ర ప్రభావం

రుణాల రికవరీ శాతాన్ని బట్టే నాబార్డు డీసీసీబీలకు నిధులు విడుదల చేస్తుంది. మొండి బకాయిల మొత్తం పెరిగితే నాబార్డు నుంచే అందే నిధులు గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటివరకు కేవలం 40 కోట్లను మాత్రమే నిరర్థక ఆస్తులుగా లెక్కల్లో చూపించారు. మిగిలిన 110 కోట్లను రావాల్సిన బకాయిల పద్దులో చూపించారు. రెండు, మూడేళ్ల గడిస్తే ఇవి కూడా నిరర్థక ఆస్తుల పద్దులోకి వెళ్లిపోతాయి. అది జరిగితే డీసీసీబీకి నాబార్డు నుంచి వచ్చే నిధులు తగ్గిపోయే ప్రమాదం ఉంటుంది.

నాటి వైసీపీ పెద్దల అత్యుత్సాహం.. క్షేత్రస్థాయి అధికారుల అవినీతి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌కు (డీసీసీబీ) మచ్చ తెచ్చిపెట్టింది. మొండి బకాయిల రూపంలో రూ.150 కోట్ల మేరా నష్టపోయే పరిస్థితి దాపురించింది. మైక్రో ఫైనాన్స్ పేరుతో డ్వాక్రా సంఘాలకు విరివిగా రుణాలు ఇప్పించి మంచిపేరు తెచ్చుకోవాలని గత వైసీపీ ప్రభుత్వం చూపిన అత్యుత్సాహం అవినీతిపరులైన ఉద్యోగులకు వరంగా మారింది. దీనికితోడు వ్యవసాయ రుణాల వసూళ్లలోనూ సుమారు రూ.80 కోట్ల వరకు మొండి బకాయిలుగా మిగిలిపోయాయి. ఇప్పటికే ఇలాంటి మొండి బకాయిల్లో రూ.40 కోట్లు తిరిగి రావని నిర్ధారించుకొని నిరర్థక ఆస్తులుగా గుర్తించింది. మరో రూ.110 కోట్లు వస్తాయో, రావో చెప్పలేని స్థితిలో ఉన్నాయి. ఉన్నతాధికారులు, పాలక వర్గ సభ్యులు గట్టిగా పట్టించుకోకుంటే మరో రెండు, మూడేళ్లలో ఈ 110 కోట్లు కూడా నిరర్థక ఆస్తుల జాబితాలోకి చేరిపోతాయి. ఇదే జరిగితే రూ.150 కోట్లు అప్పనంగా అవినీతిపరులైన కొందరు ఉద్యోగులకు, రాజకీయ పెద్ద మనుషులకు వదిలేసినట్లు అవుతుంది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

- నిరర్థక ఆస్తులుగా రూ.40 కోట్లు
- మిగిలిన రూ.110 కోట్లు వస్తాయో రావో అనుమానమే!
- డ్వాక్రా సంఘాల పేరుతో రూ.60 కోట్ల మొండి బకాయిలు
- నాటి వైసీపీ పెద్దల ఒత్తిళ్లతో ఎడాపెడా రుణాలు
- అవకాశంగా మలుచుకున్న సొసైటీ ఉద్యో
- బినామీ పేర్లతో రుణాలు స్వాహా

ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్!

జూన్ 2 వరకు నిషేధం ఎత్తివేత

ఐదేళ్లు నిండిన వారికి స్థానచలనం తప్పనిసరి

నెల్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడెప్పుడా అని ప్రభుత్వ ఉద్యోగులు ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చింది. సాధారణ బదిలీలకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకూ బదిలీలపై ఉన్న నిషేధాన్ని సడలించింది. శుక్రవారం నుంచి జూన్ 2వ తేదీ వరకూ బదిలీలపై బ్యాన్ తొలగుతుంది. ఈ మధ్య కాలంలో బదిలీల ప్రక్రియ పూర్తి చేసేలా ఆయా శాఖలకు అధికారాలు ఇచ్చింది. అన్ని శాఖలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయి. గడిచిన ఐదేళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగులందరికీ బదిలీ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అలానే ఐదేళ్లు నిండని వారికి కూడా వ్యక్తిగత రిక్వెస్ట్ మీద ఖాళీలను బట్టి బదిలీ చేసేందుకు అవకాశం కల్పించింది. ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారికీ స్థానచలనం తప్పదు. జిల్లాలో సుమారు 20 వేల మంది ఉద్యోగులు ఉండగా వీరిలో 3 వేల మంది వరకూ తప్పనిసరి బదిలీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలానే పర్సనల్ రిక్వెస్ట్ మీద మరో రెండు వేల మంది వరకూ బదిలీ జరగవచ్చని అంచనా. కొన్ని శాఖల్లో ఏళ్ల తరబడి కొందరు ఉద్యోగులు తిష్ట వేసి ఉన్నారు. అటువంటి వారందరికీ ఈ దఫా స్థాన చలనం తప్పదు. ఇక వచ్చే ఏడాది మే 31లోపు పదవీ విరమణ చేయనున్న ఉద్యోగులకు బదిలీ నుంచి మినహాయించారు. ఒకవేళ అటువంటి ఉద్యోగులు రిక్వెస్ట్ పెట్టుకుంటే బదిలీ చేయవచ్చు. ఈ దఫా బదిలీల్లో దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. అలానే గిరిజన ప్రాంతాల్లో పనిచేసిన వారు, అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. శుక్రవారం నుంచి ఉద్యోగులు బదిలీల కోసం ఆయా హెచ్‌వోడీల వద్ద దరఖాస్తు చేసుకోవచ్చు. అన్ని దరఖాస్తులు అందాక ఆయా శాఖల అధిపతులు పరిశీలించి అర్హులైన వారికి స్థానచలనం కల్పిస్తారు.

ఏపీ ఈసెట్‌లో 94.35 శాతం మంది ఉత్తీర్ణత

నెల్లూరు(విద్య), మే 15 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఈసెట్ ప్రవేశ పరీక్ష ద్వారా పాలిటెక్నిక్ డిప్లొమో, బీఎస్సీ(మ్యాథ్స్) విద్యార్థులకు బీఈ, బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో నేరుగా ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించే ఏపీ ఈసెట్ ఫలితాలను రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ గురువారం విడుదల చేసింది. జిల్లాలో 574 మంది బాలురు, 211 మంది బాలికలు కలిపి 785 మంది దరఖాస్తు చేసుకున్నారు. అనంతపురం జేఎన్‌టీయూ మే 6వ తేదీన నిర్వహించిన ఈ పరీక్షకు 761 మంది హాజరవగా 718 మంది (94.35 శాతం) అర్హత సాధించారు. చేజర్ల మండలం మడపల్లికి చెందిన పైడాల నాగ పూజిత బీఎస్సీ మ్యాథ్స్‌లో రాష్ట్రస్థాయిలో పదవ ర్యాంకు సొంతం చేసుకుంది.

సు'రక్షిత'కు నీళ్లొదిలారు!

- తుప్పు పడుతున్న బృహత్తర పథకం
- 5 మండలాలకు ఫ్లోరైడ్ నీరే దిక్కు!
- నిధులు విడుదల చేయని గత వైసీపీ సర్కారు
- నిర్వహణలో చేతులెత్తేసిన అధికార యంత్రాంగం
- ఫలితంగా అవస్థలు పడుతున్న పల్లెజనం



ఈయన పేరు చిల్లకొలుసు చిన మాల కొండయ్య, తూర్పు బోయ మడగల. నిరుపేద కుటుంబానికి ఆయన ఫ్లోరైడ్ నీటితో దాహం తీర్చుకుంటున్న తరుణం లో ఆరేళ్లుగా రెండు కాళ్లు వంకర్లు తిరిగి శరీర మంతా చచ్చుబడి పోయింది. మంచానికే పరిమితమయ్యాడు. అండగా ఉంటారనుకున్న ఇద్దరు కుమారులు సైతం మృత్యువాత పడడంతో ఎలాంటి ఆదరువు లేకుండా పోయింది. ప్రస్తుతం భార్యతో కలిసి ప్రభుత్వం అందించే పింఛనుపైనే ఆధారపడి జీవనం సాగించాల్సిన దుస్థితి నెలకొంది.

కనియంపాడు ఎస్సీ కాలనీకి చెందిన కొండిపోగు మల్లికార్జున ఫ్లోరైడ్ నీరు తాగడంతో కాళ్లు సన్నబడి చచ్చుబడి పోయాయి. దీంతో ఎలాంటి పనులు చేయలేని స్థితిలో పట్టుమని పది నిమిషాలు కూడా నిలబడే అవకాశం లేకుండా పోయింది. ప్రస్తుతం ఒంటరి జీవనం సాగిస్తున్న ఆయనకు పింఛనే దిక్కుగా మారింది. వైద్యులను సంప్రదించినా ఫలితం లేకుండా పోయింది.





కంప చెట్లతో నిండిన నీటి శుద్ధి తొట్టెలు



నిరుపయోగంగా మారిన మైక్రో ఫిల్టర్లు

ఉదయగిరి రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఫ్లోరైడ్ రహిత నీటిని అందించాలనే సదుద్దేశంతో గండిపాళెం జలాశయ ప్రాంగణంలో 1997లో రూ.7.55 కోట్లతో నిర్మించిన రాజీవ్ సబ్ మిషన్ పథకం పాలకుల పుణ్యమా అని మూలకు చేరింది. ఉదయగిరి, వరికుంటపాడు, మర్రిపాడు, కొండాపురం, దుత్తలూరు మండలాల్లోని 66 ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు సురక్షిత మంచినీరు అందించేలా ఆ పథకాన్ని రూపకల్పన చేశారు. నీటి శుద్ధిప్లాంటును నిర్మించి ప్రత్యేక పైపులైన్ల ద్వారా గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులకు శుద్ధిజలాన్ని సరఫరా చేసే పనులను 2002లో పూర్తి చేశారు. ఆ తర్వాత ఈ ప్రాజెక్టును అప్పటి కేంద్ర మంత్రి ముప్పవరపు వెంకయ్య నాయుడు ప్రారంభించారు. కొన్నేళ్లపాటు సజావుగా సాగినా కాలక్రమేణా అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం పుణ్యమా అని నీటిని సరఫరా చేసే గ్రామాల సంఖ్య తగ్గుముఖం పడుతూ ప్రస్తుతం పూర్తిస్థాయిలో నిలిచిపోయింది. కొంతమంది అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నిధుల దుర్వినియోగానికి పాల్పడి జేబులు నింపుకున్నారే తప్ప నిర్వహణను గాలికొదిలేశారని విమర్శలు ఉన్నాయి.


● రోగాల బారిన ప్రజలు

అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా కూతవేటు దూరంలో తాగునీటి పథకం ఉన్నా ప్రజలకు సురక్షిత నీటితో దాహం తీర్చుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో చేసేదేమీలేక గ్రామాల్లోని ఫ్లోరైడ్ నీటితో గొంతు తడుపుకొని రోగాల పాలు కావాల్సి వస్తోందని ప్రజలు వాపోతు న్నారు. దిష్టిబొమ్మల్లా ఓవర్‌హెడ్ ట్యాంకులు వెక్కిరిస్తున్నా యనే తప్ప తాగునీటిని అందిం చలేక పోతున్నాయని అధికారుల తీరుపై మండిపడుతున్నారు. దీంతో కిలో మీటర్ల కొద్దీ పరుగులు తీసి మంచినీటిని కొనుగోలు చేయ డం తలకు మించిన భారంగా మారుతుందని బెంబేలెత్తిపోతున్నారు. మెట్ట ప్రాంతాలకు వరంగా మారిన ఈ పథకాన్ని పునరుద్ధరిం చేలా పాలకులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● నిధుల శాపం

అంతంతమాత్రంగా మంచినీటిని సరఫరా చేస్తున్న క్రమంలో గత వైసీపీ హయాంలో నిధులు మంజూ రు కాకపోవడం ఈ ప్రాజెక్టుకు శాపంగా మారింది. కనీసం టెండర్ల ప్రక్రియ కూడా చేపట్టకపోవడంతో అటువైపు కన్నెత్తి చూసే నాధులే కరువయ్యారు. దీంతో అధికారులు సైతం మనకెందుకులే అంటూ మౌనం దాల్చడంతో పథకం మూలకు చేరింది. రూ.లక్షలు విలువ చేసే మైక్రో, నీటిశుద్ధి ఫిల్టర్లు, విద్యుత్ మోటార్లు, ఇతరత్రా సామగ్రి తుప్పు పట్టి మట్టిలో కలిసిపోతున్నాయి. కనీసం పంప్‌హౌస్ గదికి కూడా తాళాలు వేయకపోవడంతో విద్యుత్ మోటార్లు చోరీకి గురవుతున్నాయి. నీటిశుద్ధి తొట్టెల చుట్టూ కంపచెట్లు పెరిగి గోడలు సైతం నెర్రలు బారి ధ్వంసమవుతున్నాయి. ప్రాంగణమంతా అడవిని తలపిస్తుండగా, కొంతమంది తమ అవసరాల కోసం అక్కడున్న ఇసుక, ఇతర సామగ్రిని తరలించుకు పోతున్నారు.

అలంకార ప్రాయంగా మిగిలిన ట్యాంకు



అధికారులు స్పందించాలి



కనియంపాడు, జంగంరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఫ్లోరిన్ బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. రక్షిత నీటి సరఫరా ఆగిపోవడంతో ఫ్లోరిన్ నీటితోనే సర్దుకుంటున్నారు. ఈ విషయమై కీలక సమావేశాల్లో ప్రస్తావించినా, జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేదు. ఉన్నతాధికారులు స్పందించి పథకం పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలి.

- కే. దిలీప్‌కుమార్, సర్పంచు వరికుంటపాడు

కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నాం



రక్షిత నీరు అందించేందుకు గ్రామాల్లో నిర్మించిన వాటర్ ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. దీంతో ఫ్లోరైడ్ నీటిని తాగి కిడ్నీ సంబంధిత వ్యాధులతో కొంతమంది మృత్యువాత పడుతున్నారు. మరికొంతమంది మంచాలకే పరిమితమవుతున్నారు. గండిపాళెం నుంచి రాజీవ్ టెక్నాలజీ మిషన్ పథకం ద్వారా రక్షిత నీరు అందించాలి.

- దొడ్లా మౌలాలి, తోటలచెరువుపల్లి

రైతులకు సబ్సిడీపై స్ప్రేయర్ల పంపిణీ

మనుబోలు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు సబ్సిడీపై స్ప్రేయర్లను గురువారం మండల వ్యవసాయాధికారి జహీర్ పంపిణీ చేశారు. రూ. 26వేలు విలువచేసే స్ప్రేయర్‌ను ప్రభుత్వం 10వేల సబ్సిడీతో రైతుకు రూ. 16వేలకు అందించిందని ఏవో తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల్లోని 17మంది రైతులకు ఈ స్ప్రేయర్లను మనుబోలు రైతుసేవాకేంద్రం-2 వద్ద అందించినట్లు ఏవో వివరించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8914
వెండి కిలో ధర	రూ. 97,300
వెండి ఒక గ్రాము	రూ. 100.30

కూటమితో వ్యవసాయ శాఖకు
ఊపిరి వచ్చింది

● ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, మే 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాకే రాష్ట్రంలో వ్యవసాయ శాఖకు ఊపిరి వచ్చిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా 30మంది రైతులకు స్ప్రేయర్లు, ఇద్దరికి బ్రష్‌కట్టర్లు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ళ తరువాత మళ్ళీ వ్యవసాయ యంత్రీకరణ మొదలైందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖను మూసేశారన్నారు. ఒక్కో స్ప్రేయర్‌పై రూ. 10వేలు, బ్రష్ కట్టర్లపై రూ. 17,340 సబ్సిడీ ఇస్తూ ప్రభుత్వం రైతులకు వ్యవసాయ యంత్రాలను అందించిందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకుని, మంచి దిగుబడులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అధ్వానంగా వెంకన్నపాళెం రోడ్డు

● ప్రయాణికుల అవస్థలు

తోటపల్లి గూడూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకన్నపాళెం రోడ్డు అధ్వానంగా మారి ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డు మీదుగా 11 రొయ్యల హేచరీ కంపెనీలు ఉన్నాయి. దీంతో వాహనాలు ప్రతినిత్యం తిరుగుతుంటాయి. కంపెనీలు కాని, ప్రభుత్వం కాని ఈ రోడ్డు పరిస్థితిని పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ రోడ్డు గుండా ప్రయాణం చేయాలంటే నరకయాతన అనుభవిస్తున్నామని వెంకన్నపాళెం ప్రజలు వాపోతున్నారు. గతంలో పనిచేసిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రోడ్డును నెలరోజుల్లోపూర్తి చేస్తామని మాట ఇచ్చి రోడ్డును కన్నెత్తి చూడలేదని, కూటమి ప్రభుత్వమైనా ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.





జొన్నవాడ పెన్నానదిలో స్నానాలు చేస్తున్న భక్తులు, పర్యాటకులు

ఎండకు పెన్నాలో స్నానం.. సేద తీరుతున్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం, మే15 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న భానుడి భగభగలతో జొన్నవాడ ఆలయానికి వచ్చే భక్తులు, పర్యాటకులు పెన్నానది స్నానాలతో సేద తీరుతున్నారు. గత 10రోజులుగా కాస్తున్న మండుటెండల ధాటికి జనాలు, ప్రధానంగా వృద్ధులు విలవిల్లాడుతున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఇళ్లలో నుంచి బయటకు ముఖం పెట్టలేని పరిస్థితి. చిన్నారులు, వృద్ధులయితే ఎండసెగకు కనీసం అన్నంతినలేని పరిస్థితి.మరి కొన్ని రోజులు ఈ సెగ భరించాలంటూ నిపుణులు అంటున్నారు.

ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణ

బుచ్చిరెడ్డిపాళెం,మే16(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో అభ్యంతరంలేని ఆక్రమణలను క్రమబద్ధీకరిస్తామని కమిషనర్ బాలకృష్ణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పాటుతో జీవనం సాగిస్తున్న ప్రజలకు హక్కులు పొందేలా అవకాశం కల్పిస్తామన్నారు. నగర పంచాయతీ ఎలాంటి అధీకృత ధ్రువీకరణ పత్రాలు లేనందున తొలగింపు, బెదిరింపులకు పేదలు గురవుతున్నారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల అభ్యర్థనల మేరకు అభ్యంతరాలు లేని నివాసాలను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందన్నారు. వార్డుల్లో నిర్వహిస్తున్న సర్వేకు ప్రజలు సహకరించి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



జనసచారం లేక నిర్మానుష్యంగా ఉన్న బజారు వీధి

ఎండలతో ప్రజలు బెంబేలు

రాపూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): భానుడి భగభగలకు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఎండలకు భయపడి చుటుపక్కల గ్రామాల వారు 10 గంటలకే పనులు చేసుకొని వారి గమ్యాలకు చేరుకుంటున్నారు. ఉదయం 10 గంటలు దాటిన తర్వాత జనసంచారం లేక బజార్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

కోవూరు నియోజకవర్గంలో
మండలాల టీడీపీ సారథుల నియామకం

కోవూరు/ఇందుకూరుపేట/కొడవలూరు/విడవలూరు/బుచ్చిరెడ్డిపాళెం, మే15(ఆంధ్రజ్యోతి): కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు, బుచ్చి నగర పంచాయతీకి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నియమితులయ్యారు. ఈ మేరకే ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందించారు. నూతన సారథులు కూడా మండలాల్లో పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారు. కోవూరు మండల పార్టీ అధ్యక్షుడిగా ఇనమడుగుకు చెందిన కొల్లారెడ్డి సుధాకర రెడ్డి నియమితులయ్యారు. ఇందుకూరుపేట మండల అధ్యక్షుడిగా ఏకొల్లు పవన్‌కుమార్ రెడ్డి నియమితులయ్యారు. కొడవలూరు మండల అధ్యక్షుడిగా కమ్మపాళెంకు చెందిన నాపా వెంకటేశ్వర్లు నాయుడును నియమించారు. బుచ్చి అర్బన్ అధ్యక్షుడిగా బుచ్చికి చెందిన గుత్తా శ్రీనివాసులు, బుచ్చి రూరల్ అధ్యక్షుడిగా దామరమడుగుకు చెందిన బెజవాడ జగదీష్, మండల గౌరవాధ్యక్షుడిగా టి.మల్లారెడ్డిని నియమించారు. ఇక విడవలూరు మండల పార్టీ అధ్యక్షుడిగా యెటూరు శ్రీహరిరెడ్డిని నియమించారు. తమ మీద నమ్మకంతో పదవులు ఇచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు అజీజ్, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.



ఇందుకూరుపేట : పవన్‌కుమార్ రెడ్డి



విడవలూరు : శ్రీహరిరెడ్డి



కోవూరు : సుధాకరరెడ్డి



కొడవలూరు : వెంకటేశ్వర్లు



బుచ్చి అర్బన్ : శ్రీనివాసరావు



బుచ్చి రూరల్ : బెజవాడ జగదీష్

జాతీయ రహదారిపై కారు బోల్తా



బోల్తా పడిన కారు

వెంకటాచలం, మే 15 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి కారు బోల్తా పడడంతో పలువురికి స్వల్ప గాయాలైన సంఘటన వెంకటాచలం సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గూడూరు నుంచి నెల్లూరు వైపు వెళుతున్న కారు అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వపు తహసీల్దారుపై
విచారణ

● రైతులకు నోటీసుల జారీ

పొదలకూరు : పొదలకూరు పూర్వపు తహసీల్దారుగా పనిచేసిన టి.స్వాతి ప్రభుత్వ భూములను అక్రమంగా అప్పగించారన్న విషయంలో కేసు నమోదు చేసి ఉన్నారు. గురువారం మండలంలోని ఆల్తుర్తి, వసంతోపు, మొగళ్లూరు, ఆర్వైపాళెం తదితర గ్రామాలకు చెందిన రైతులకు అధికారులు నోటీసులు అందజేశారు. రెండు రోజుల్లో నెల్లూరు ఏసీబీ కార్యాలయానికి వచ్చి వాఙ్మూలం ఇవ్వాలని ఆ నోటీసులో కోరారు. పోరంబోకు, ఇతర భూములను తహసీల్దారు స్వాతి తన ఇష్టానుసారం పట్టాలు ఇచ్చారన్న ఆరోపణలపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

యువత భవిష్యత్తుకు ఎన్‌సీసీ పునాది



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు నరసింహారెడ్డి

వెంకటాచలం, మే 15 (ఆంధ్రజ్యోతి): యువత భవిష్యత్తుకు ఎన్‌సీసీ మంచి పునాదిలాగా నిలుస్తుందని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని చవటపాళెం పంచాయతీ పరిధిలోని నరస్వతీనగర్‌లో ఉన్న అక్షర విద్యాలయంలో ఎన్‌సీసీ శిక్షణా శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా యోగా, డ్రిల్, వ్యాయామం, ఫైరింగ్‌లపై శిక్షణ ఇచ్చి, ఎన్‌సీసీ సిలబస్‌పై తరగతులు నిర్వహించారు. ఈసమావేశంలో ఎన్‌సీసీ కమాండెంట్ కల్నల్ డి కరంచంద్, మేజర్ రాజేష్‌కుమార్, హేమంత్‌కుమార్, ఎన్‌సీసీ అధికారి బాలబ్రహ్మాచారి, మస్తాన్‌వలి, దీప్తి, పెంచలపుల్లయ్య, హరీష్‌రెడ్డి, జయరాం, శ్రీపతి ప్రసాద్, జావిద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణను వేగవంతం చేయాలి



కార్యదర్శులకు సూచనలు ఇస్తున్న ఈవోపీఆర్డీ నారాయణ

మనుబోలు, మే 15 (ఆంధ్రజ్యోతి): పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన 7 పంచాయతీల్లో ఇంటింటా చెత్త సేకరణను వేగవంతం చేయాలని మండల పంచాయతీ విస్తరణాధికారి నారాయణ సూచించారు. గురువారం ఆయన మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటా చెత్త సేకరణపై 7 పంచాయతీల్లో ప్రభుత్వం ప్రజాభిప్రాయం ఐవీఆర్‌ఎస్ ద్వారా సేకరిస్తుందన్నారు. వారంలో రెండుదఫాలుగా ఇంటినుంచి తడిచెత్త, పొడిచెత్త సేకరణను కార్యదర్శులు పంచాయతీ సిబ్బందిచే సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత కార్యదర్శులదేనన్నారు. పంచాయతీల్లో అవసరాల మేరకు చెత్తబుట్టలు, రిక్షాలు, ఇతర సామగ్రి కొనుగోలు చేసుకోవాలన్నారు. ఇంటి, కొళాయి పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా పూల ప్రశాంత్



ప్రశాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్న బీజేపీ నాయకులు

పొదలకూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా పూల ప్రశాంత్‌ను ఆపార్టీ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం నెల్లూరు జిల్లా బీజేపి కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రశాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తన మీద నమ్మకంతో పార్టీ బాధ్యతలను అప్పగించిన జిల్లా పెద్దలకు ప్రశాంత్ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి సీనియర్ నాయకులు బాలిరెడ్డి మారుతిరెడ్డి, రవీంద్రారెడ్డి, సిహెచ్ సుబ్రమణ్యం, సిరిగిరి ఓబులేసు, సురేంద్రబాబు, రాచపూటి ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల అభివృద్ధికి నిధులు పెంచండి

● సర్పంచు గోపిరెడ్డి పావని

తోటపల్లి గూడూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల అభివృద్ధికి నిధులు పెంచాలని మండలంలోని విలుకానిపల్లి సర్పంచు గోపిరెడ్డి పావని 16వ ఫైనాన్స్ కమిషన్ సభ్యులకు, కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం తిరుపతి తాజ్ హోటల్‌లో 16వ ఫైనాన్స్ కమిషనర్ డా. సౌమ్య కాంతి ఘోష్ ఆధ్వర్యంలో గ్రామీణ స్థానిక సంస్థలు, పట్టణ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్రం నుంచి మరింత నిధులను పెంచి స్థానిక సంస్థలను బలోపేతం చేసి ఆదుకోవాల్సిందిగా సర్పంచు గోపిరెడ్డి పావని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 2011 జనాభా ప్రాతిపదికన కాకుండా ప్రస్తుతం పెరిగిన జనాభా ప్రకారం ఆర్థిక వనరులు లేని పంచాయతీలకు అదనంగా నిధులు మంజూరు చేసి పంచాయతీ అభివృద్ధికి దోహదపడాలన్నారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల నుంచి 25మంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తమ సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె తెలిపారు.

అదనపు వసూళ్లను నియంత్రించాలి

● గ్యాస్ డీలర్లకు లీగల్ మెట్రాలజీ అధికారుల సూచన



డీలర్లకు సూచనలిస్తున్న ఈశ్వరరావు, పక్కనే ఇన్‌స్పెక్టర్ రియాజ్ అహ్మద్

నెల్లూరు (వ్యవసాయం), ఏప్రిల్ 15(ఆంధ్ర జ్యోతి): వంట గ్యాస్ వినియోగ దారు లకు సిలిం డరు డెలివరీ సమయంలో సిబ్బంది అదనపు వసూళ్లకు పాల్పడకుండా చర్యలు తీసుకో వాలని గ్యాస్ డీలర్లకు నెల్లూరు లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఈశ్వరరావు సూచించారు. ప్రపంచ తూనికలు, కొలతల దినోత్సవాన్ని పురస్కరించుకుని మెట్రాలజీ వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లాలోని గ్యాస్ డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వ హించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ డెలివరీ బాయ్ వినియోగ దారులు అడగక పోయినా గ్యాస్ బరువు తప్పనిసరిగా చూపాలన్నారు. ప్లాంట్ నుంచి సిలిండర్లను అందుకునే సమయంలో కూడా బరువు పరిశీలించాలని, తక్కువ బరువు ఉన్నవాటిని అక్కడే వదిలివేయాలని సూచించారు. 19 కిలోల సిలిండర్లపై ధర, బరువు ట్యాగ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇంకా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రియాజ్ అహ్మద్, జోన్ డిప్యూటీ కంట్రోలర్ ఇస్హాక్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలకు వేలం

● ఈసారి అదనంగా రూ.3,39,500 ఆదాయం



రామలింగేశ్వర స్వామి ఆలయంలో వేలం నిర్వహిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

విడవలూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామతీర్థంలో వెలసివున్న రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు జూన్ 16 నుంచి 26 వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తాత్కాలిక, శాశ్వత దుకాణాల ఏర్పాటు, కరపత్రాల ముద్రణ, దేవాలయానికి రంగులు, విద్యుత్ దీపాలంకరణకు సంబంధించి గురువారం దేవదాయశాఖ అధికారులు వేలం నిర్వహించారు. గత ఏడాది రూ.4,12,500 వేలం ద్వారా ఆదాయం రాగా, ఈ సారి జరిగిన వేలంలో రూ.7,52,200 వచ్చింది. దీంతో రూ.3,39,500 అదనపు ఆదాయం దేవదాయశాఖకు వచ్చింది. పూజా టెంకాయల అమ్మకాల ద్వారా గతంలో రూ.1,60వేలు రాగా, ప్రస్తుతం రూ.1.67 లక్షలు, బహ్మోత్సవాల తరువాత టెంకాయల అమ్మకాలకు గతంలో రూ.1.62,500, ఇప్పుడు రూ.1.94 లక్షలు వచ్చాయి. తాత్కాలిక అంగళ్లకు గతంలో రూ.63వేలు రాగా ప్రస్తుతం రూ.2.71లక్షలు వచ్చింది. కొబ్బరి చిప్పల సేకరణకు గతంలో రూ.27 వేలు రాగా, ప్రస్తుతం రూ. 1.20లక్షలు వచ్చింది. ఈ సందర్భంగా ఆలయ ఈవో రామకృష్ణ మాట్లాడుతూ రంగుల రాట్నం నిర్వహించేందుకు ఎవరూ రానందున తాత్కాలికంగా వేలం వాయిదా వేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రఘురామయ్య, కృష్ణప్రసాద్, చందన, టీడీపీ నాయకులు ఆవుల వాసు, చిన్నిబాబు, కటారు సుబ్రహ్మణ్యం, పురిణి హరి, పొన్నాడి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

గోపాల్‌రెడ్డి నగర్‌లో
వ్యక్తి దారుణహత్య

● ఆస్తి వివాదాలే కారణమంటున్న భార్య, బంధువులు



హత్యకు గురైన మల్లికార్జునరెడ్డి (ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం, మే15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రెడ్డి నగర్‌లో బుధవారం రాత్రి ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. హత్యకు గురైంది సోము మల్లికార్జున రెడ్డి అని తెలుసుకున్న బుచ్చి, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు గురువారం ఉదయం హత్య జరిగిన పొలాల వద్దకు చేరుకున్నారు. ఈ హత్యకు ఆస్తి వివాదాలే కారణమని మృతుడి భార్య, బంధువులు ఆరోపిస్తున్నారు. కాగా ట్రైనీ డీఎస్పీ శివప్రియ, ఇన్‌చార్జి సీఐ సుధాకర్‌రెడ్డి ,ఎస్‌ఐ సంఘటనా స్థలానికి చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. హత్యకు గల కారణాలపై రైతులు, బంధువులను విచారించారు. జాగిలాలతో పోలీసులు ఆప్రాంతంలో పలుచోట్ల తిరిగారు. మృతుడి భార్య సోము సుకేసిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఆమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

● దుక్కిదున్ని వస్తానని వెళ్లి...

పొలంలో వరినాట్లు వేసేందుకు ట్రాక్టర్‌తో దుక్కి చేసి వస్తానని చెప్పి బుధవారం సాయంత్రం 3 గంటలకు పొలానికి వెళ్లిన భర్త రాత్రి 8 గంటలైనా ఇంటికి రాలేదు. దీంతో భార్య సుకేసిని రాత్రి 10.30 వరకు పదేపదే ఫోన్లు చేసింది. ఎంతకీ లిఫ్ట్ చేయకపోవడంతో సమీప బంధువు, వాచ్‌మన్‌ను తీసు కుని పొలానికి వెళ్లింది. అక్కడ షెడ్డు పక్కనే కాలువకట్టపై భర్త నెత్తుటి మడుగులో పడిఉండడంతో కన్నీరుమున్నీరైంది. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భర్తను చంపింది ఆయన తమ్ముడు రామచంద్రారెడ్డి, అయన కుటుంబ సభ్యులేనని సుకేసిని ఆవేదన వ్యక్తం చేసింది. ఇటీవల తమ పొలంలో మోటార్లు ధ్వంసం చేయడం, పైపులైన్లు కోసేయడం, టెంకాయ చెట్లు నరకేయడం... ఎంత కసితో చేశారో తన భర్తను కూడా అదే కసితో చంపారని రోదించింది. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

● సీఐ వల్లే ఇవన్నీ...

బుచ్చిలో క్రైంరేట్ పెరగుతున్నా సీఐ శ్రీనివాసులురెడ్డి పట్టించుకోకపోవడం వల్లే హత్యలు జరుగుతున్నాయని ట్రైనీ డీఎస్పీ ముందు ఓ వ్యక్తి వాపోయాడు. మరొకరు మర్డర్ జరగకుండా చూడాలని కోరారు. రూరల్ డీఎస్పీ చెప్పినా కేసు నమోదు చేయడంలేదని పేర్కొన్నారు.

● 30 ఏళ్ల తరువాత మళ్లీ..

గత 30 ఏళ్లుగా ప్రశాంతంగా ఉన్న బుచ్చి మండలంలో వరుస హత్యలు, కిరాయి హత్యలు, రౌడీమూకల ఆగడాలతో ప్రజలు ఉలికిపాటుకు గురవుతున్నారు. గత ఐదు నెలల్లోపు బుచ్చి మండలంలో మూడు హత్యలు చోటుచేసుకున్నాయి. ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించి బుచ్చిలో నేరాలు అదుపు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చికెన్ వ్యర్థాల వాహనాల పట్టివేత

● కేసు నమోదు



చికెన్ వ్యవర్థాలను పూడ్చిపెడుతున్న పోలీసులు, మత్స్య శాఖ అధికారులు

సంగం, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంబయి జాతీయ రహదారిపై వెళ్తున్న రెండు చికెన్ వ్యర్థాల వాహనాలను గురువారం పోలీసులు, మత్స్యశాఖ అధికారులు పట్టుకున్నారు. ఈ వాహనాల్లో సుమారు 50 డమ్ముల్లో చికెన్ వ్యర్థాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీటిని స్థానిక కొండ దిగువ ప్రాంతంలో గుంట తీసి అందులో పూడ్చివేశారు. రెండు వాహనాల డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమృత్ పైలాన్ ధ్వంసం కేసులో
పోలీసు కస్టడీకి నిందితులు

కావలి, మే15(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అమృత్ పథకం పైలాన్‌ను ధ్వంసం చేసిన కేసులో అరెస్ట్ అయి, సబ్‌జైలులో ఉన్న నలుగురు నిందితులను గురువారం పోలీసులు తమ కస్టడీకి తీసుకున్నారు. ఈ కేసులో 12 మంది నిందితులను గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు. వారిలో జర్నలిస్టులు, యూట్యూబర్లు కుర్రు శ్రీనివాసరావు, కేదారి కొండయ్య, బీవీ లక్ష్మీనారాయణ, టీ. ప్రసాద్‌ను అరెస్ట్ చేసి జైలుకు పంపిన విషయం తెలిసిందే. ఈ కేసులో మరింత సమాచారం రాబట్టేందుకు పోలీసులు కోర్టు ద్వారా వారిని రెండు రోజులు కస్టడీకి తీసుకున్నారు. గురువారం నలుగురిని పోలీసులు విచారించారు. శుక్రవారం కూడా విచారణ చేపట్టనున్నారు. ఈ కేసులో ఇంకా ఎవరెవరు ఉన్నారో.. వారందరి వివరాలు బయటకు వస్తాయని వైసీపీ నేతలు భయందోళన చెందుతున్నారు. సుమారు 30 మంది వరకు ఉండవచ్చనే ప్రచారం జరుగుతుండడంతో ఈ కేసులో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధాలు ఉన్న వారంతా ఎక్కడ తమ పేర్లు బయటకు వస్తాయోనని ఆందోళన చెందుతున్నారు.

ఆటోలో నుంచి పడి యువకుడి మృతి

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు కింద పడి కోనా రవికుమార్(36)మృతి చెందా డు. ఈ సంఘటన కావలి మండలం తుమ్మలపెంట సమీపంలో గురువారం జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు, మండలంలోని కొత్తసత్రానికి చెందిన రవికుమార్ ఆటోలో కావలి నుంచి గ్రామానికి వెళ్తూ జారి పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్లశాఖ డీఐజీగా మునిశంకరయ్య

నెల్లూరు(హరనాథపురం), మే 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రిజిస్ట్రేషన్లశాఖ డీఐజీగా మునిశంకరయ్యను నియమిస్తూ ఆ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మునిశంకరయ్య చిత్తూరు జిల్లాలో ఆడిట్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్నారు. పదోన్నతిపై నెల్లూరు డీఐజీగా నియమితులయ్యారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 515



పశుపక్ష్యాదుల కోసం..

వేసవి తాపానికి అన్ని జీవులు దాహార్తితో అల్లాడుతున్నాయి. పశువులు, పక్షులు నీరు దొరక్క ప్రాణాలు కోల్పోయే దుస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో నెల్లూరు కార్పొరేషన్ అధికారులు నగర రోడ్ల పక్కన తొట్లు ఏర్పాటు చేసి వాటిని నీటితో నింపుతున్నారు. పశువులు, పక్షులు దాహం తీర్చుకునే విధంగా ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం ఈ తొట్లలో నీటిని నింపే ప్రక్రియను గురువారం నుంచి మొదలుపెట్టారు.

- నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి)


మందు ఎలా ఉంది?

గత వైసీపీ పాలనలో మందుబాబులు పడ్డ కష్టాలు వర్ణనాతీతం. పాత బ్రాండ్లు దొరక్కపోవడం, బార్లలో మాత్రమే మందుబాబులు ఇష్టంగా తాగే మద్యం దొరకడం, క్యూలైన్లలో గంటల సమయం నిల్చోవడం, మద్యం దుకాణాల్లో సిబ్బంది నోటికొచ్చినట్లు మాట్లాడటం, బార్లలో ఆకాశాన్ని అంటిన మద్యం ధరలు.... ఇలా చెప్పుకుంటూ పోతే మందుబాబులు ఐదేళ్లు నరకం అనుభవించారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటు వ్యక్తులకు వైన్‌షాపులను అప్పగించడం, పలు పాత బ్రాండ్లు అందుబాటులోకి తీసుకురావడం, మద్యం ధరలు గత ప్రభుత్వంలో కంటే తగ్గించడం, ఎంఆర్‌పీ తప్పనిసరిగా అమలు అయ్యేలా చేయడం వగైరా చర్యలు చేపట్టింది. అయితే ఎన్ని చర్యలు చేపడుతున్నా కింది స్థాయిలో అవి అమలవుతున్నాయా? లేదా అని తెలుసుకునేందుకు కూటమి ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది.



- మద్యం నాణ్యత, బ్రాండ్లు, ధరలపై అభిప్రాయాలు
- వైన్ షాపుల్లో క్యూఆర్ కోడ్‌లు
- స్కాన్ చేసిన వెంటనే ప్రశ్నలు
- ఫిర్యాదులు నేరుగా సీఎం డ్యాష్‌బోర్డుకు...
- ఆ వెంటనే ఎక్సైజ్ అధికారుల విచారణ

నెల్లూరు(క్రైం), మే 15 (ఆంధ్రజ్యోతి) :నేరుగా బార్లు, మద్యం షాపుల వద్ద మందుబాబుల అభిప్రాయాలు వెల్లడించేలా క్యూఆర్ కోడ్‌లు ఏర్పాటు చేసింది. ప్రతి బార్, షాపులో కౌంటర్, బయట గోడలపైన.. ఇలా ఐదు చోట్ల క్యూఆర్ కోడ్‌లను ఎక్సైజ్ సిబ్బంది అతికించారు. వినియోగదారులు ఎప్పుడైనా ఆ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అందులోని ప్రశ్నావళికి సమాధానాలు ఇవ్వడం ద్వారా అభిప్రాయాలు తెలియజేయవచ్చు. వాటి ఆధారంగా మద్యం నాణ్యత, ధరలు, సిబ్బంది ప్రవర్తన తదితర అంశాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది.



● స్కాన్ చేసిన వెంటనే ప్రశ్నలు

జిల్లా వ్యాప్తంగా 59 బార్లు, 190కు పైగా మద్యం దుకాణాల వద్ద ఎక్సైజ్ అధికారులు క్యూఆర్ కోడ్‌ను ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల రోజుల కిందట ఏర్పాటు చేశారు. సెల్‌ఫోన్‌లోని క్రోమ్, గూగుల్ నుంచి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన వెంటనే మద్యం షాపులపై సర్వే అంటూ లింక్ ఓపెన్ అవుతుంది. అందులో గతంతో పోలిస్తే మద్యం నాణ్యత పెరిగిందా, పాపులర్ మద్యం బ్రాండ్‌లు అందుబాటులో ఉన్నాయా, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో మద్యం బ్రాండ్‌ల ధరలు ఇంతకు ముందు కన్నా ఇప్పుడు తగ్గాయా, మీ ప్రాంతాల్లో రిటైల్ మద్యం దుకాణాలలో ఏవైనా ఎంఆర్‌పీ ఉల్లంఘనలను మీరు గమనించారా, మద్యం దుకాణంలోని సిబ్బంది ప్రవర్తన ఎలా ఉంది.. వంటి ప్రశ్నలు కన్పిస్తాయి. వాటి కిందే అవును, కాదు అన్న సమాధానాలు కన్పిస్తాయి. వాటిలో ఏదో ఒక దానిపై క్లిక్ చేసి ఎంటర్ బటన్ నొక్కితే ఆ వెంటనే పేరు, మొబైల్ నెంబరు, జెండర్, డేట్ ఆఫ్ బర్త్ ఇలా పలు ప్రశ్నలతో కూడిన కాలమ్స్ ఉంటాయి వాటిని పూర్తి చేసి సబ్‌మిట్ చేస్తే ఆ ఫీడ్‌బ్యాక్ నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రి డ్యాష్ బోర్డుకు, ప్రభుత్వానికి, ఎక్సైజ్ శాఖకు చేరుతుంది. ఆ ఫిర్యాదులు జిల్లా ఎక్సైజ్ అధికారులకు అందడంతో వారు సంబంధిత మద్యం దుకాణాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటారు.

విద్యాసంస్థల్లో భద్రత ఎంత?

- కనీస నిబంధనలు పాటించని యాజమాన్యాలు
- ప్రమాదం జరిగితే పసి ప్రాణాలకే ముప్పు..
- మొద్దునిద్ర వీడని అధికారులు

ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులు దండుకోవడంలో చూపుతున్న శ్రద్ధ విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంలో చూపడం లేదు. ఆటపాటలు లేకపోగా కనీసం మరుగుదొడ్లు కూడా సరిగ్గా లేక అవస్థలు పడుతున్నారు. ఇరుకు గదులు, అపార్ట్‌మెంట్లలో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల భద్రత గాలిలో దీపంలా మారుస్తున్నారు. జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థల స్థితిగతులపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

- నెల్లూరు(విద్య, ఆంధ్రజ్యోతి)



వచ్చే నెలలో స్కూళ్ల పునఃప్రారంభం

జిల్లాలో అత్యధికశాతం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు ఇరుకు గదులు, వ్యాపారసంస్థలు, అపార్ట్‌మెంట్లలో నడుపుతున్నారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 650 ప్రైవేటు పాఠశాలలు, 200 ఇంటర్ కళాశాలలు, 45 డిగ్రీ కళాశాలలు, 25 ఎంబీఏ, ఎంసీఏ, 20 పీజీ, 15 బీఈడీ కళాశాలలు ఉన్నాయి. ఇవికాకుండా గుర్తింపు లేని విద్యాసంస్థలు మరో వంద వరకు ఉన్నాయి. విద్యార్థుల భద్రత కోసం ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సి ఉంది. ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే విద్యార్థులను కాపాడేందుకు తప్పనిసరిగా అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసుకోవాలి. అసలు భవన నిర్మాణ సమయంలోనే ఈ జాగ్రత్తలు తీసుకుంటేనే అనుమతులు లభిస్తాయి. కానీ జిల్లాలో అత్యధిక శాతం యాజమాన్యాలు నిబంధనలు తుంగలో తొక్కి తమ పలుకుబడులతో వీటిని నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏదైనా జరగరాని విపత్తు జరిగితే మాత్రం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ముడుపులతో సరి

జిల్లావ్యాప్తంగా అత్యధిక విద్యాసంస్థలు నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయి. ఇరుకు సందుల్లో, అపార్ట్‌మెంట్లలో, షాపింగ్ కాంప్లెక్స్‌లో తరగతి గదులు నిర్వహిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే కనీసం ఫైర్‌ఇంజన్ కూడా వెళ్లేందుకు వీల్లేని పరిస్థితుల్లో విద్యాసంస్థలు నడుస్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వీటిని అడ్డుకోవాల్సిన సంబంధిత శాఖలు ముడుపులతో, రాజకీయ నేతల సిఫారసులతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

● నిబంధనలు గాలికి..

విద్యాసంస్థల్లో గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్తుల్లో అగ్నిమాపక పరికరాలైన సీవోటీ, సిలిండర్లు, ఇసుక, నీటి హౌస్‌పైపులు, రోప్‌లు ఏర్పాటు చేసుకోవాలి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నీటి ట్యాంకులు నిర్మించుకోవాలి. అలాగే మూడు, ఆపై అంతస్తులు ఉంటే వాటిలో కూడా ఇదే తరహాలో అగ్నిమాపక పరికరాలు ఉండాలి. అగ్నిప్రమాదాలు సంభవించినపుడు విద్యార్థులు సులువుగా బయటకు వచ్చేందుకు విశాలమైన మెట్లు, అత్యవసర మార్గాలు ఉండాలి. కానీ అత్యధిక విద్యాసంస్థల్లో ఇలాంటి పరిస్థితులు లేవు.

● వసతుల లేమి

విద్యార్థుల నుంచి రూ.వేలకువేలు ఫీజులు దండుకుంటున్న విద్యాసంస్థలు వారికి కనీస వసతులు కల్పించడం లేదు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు కూడా కరువయ్యాయి. పేరుకేమో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలుగా పిలిపించుకుంటూ నిబంధనలకు తిలోదకాలిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విద్యాసంఘాల నేతల ఆరోపిస్తున్నారు. అగ్నిమాపక శాఖ నుంచి తప్పనిసరిగా ఎన్‌ఓసీ తీసుకోవాల్సి ఉండగా కొన్ని విద్యాసంస్థలు మాత్రమే వీటిని తీసుకోగా అధికసంఖ్యలో విద్యాసంస్థలకు ఎన్‌ఓసీ లేకపోవడం గమనార్హం. వీటిపై తనిఖీ చేయాల్సిన అధికారులు మిన్నకుండి పోతున్నారు.

ఎరుకులకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి

ఎస్ఈకి సీపీఎం వినతి

నెల్లూరు (వైద్యం), మే 15 (ఆంధ్ర జ్యోతి) : వైఎస్సార్ నగర్‌లో ఎరుకుల కులస్థులకు కరెంటు కనెక్షన్ ఇచ్చి మీటర్లు బిగించాలని కోరుతూ సీపీఎం నాయకులు గురువారం విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్‌కు వినతిపత్రం ఇచ్చారు. మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైఎస్సార్ నగర్‌లో నివసిస్తున్న ఎరుకుల వారికి ఇంతవరకు కరెంటు మీటర్లు బిగించలేదన్నారు. కాలనీ ఏర్పడినప్పటి నుంచి వారు ఇక్కడ నివసిస్తున్నారని అయినా నేటికీ వారికి కరెంటు కనెక్షన్ ఇవ్వలేదన్నారు. దీనివల్ల నిరుపేదలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.ఈ కార్యక్రమం లో సీపీఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, నాయకులు కట్టా సతీష్, సంపత్ కుమార్, గౌస్‌పీర్, సురేష్, దశయ్య, కండె కోటేశ్వర రావు, బుడ్డయ్య, రమేష్, పెంచలయ్య, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీలు రద్దుచేయండి

● విద్యుత్ భవన్ ఎదుట సీపీఎం ధర్నా

నెల్లూరు (జడ్పీ), మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై పెనుభారంగా మారిన ట్రూఅప్ చార్జీలను రద్దుచేయాలని సీపీఎం నేతలను డిమాండ్ చేశారు. పెంచిన చార్జీలకు నిరసనగా విద్యుత్ భవన్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ట్రూఅప్ చార్జీల భారాన్ని రూ.1548కోట్ల మేర ప్రజలపై మోపారన్నారు. అయితే అధికారంలోకి వస్తే ఎలాంటి విద్యుత్ చార్జీలు పెంచమని, 30 శాతం తగ్గిస్తామని హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఆ తరువాత మాటమార్చి గత ప్రభుత్వ విధానాలనే కొనసాగిస్తూ, ట్రూఅప్ చార్జీల పేరుతో పెనుభారాన్ని మోపుతోందని విమర్శించారు. యూనిట్‌కు రూ.1.21పైసల చొప్పున 2022-23ఏడాదికి రూ. 6072కోట్లు, 23-24 సంవత్సరానికి రూ.11,826 కోట్ల భారాన్ని ప్రజలపై మోపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దీనిపై పునరాలోచన చేయాలని కోరారు. ఆదానీ సంస్థతో చేసుకున్న సెకీ ఒప్పందాన్ని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్‌మీటర్లను నిలిపివేయాలని కోరారు. అనంతరం ఎస్ఈ విజయన్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంచల నరసయ్య, అబ్దుల్ అజీజ్, రఫీ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార విద్యార్థులకు గంగా సరస్వతి పురస్కారాలు

నెల్లూరు(విద్య), మే 15 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన మత్స్యకార విద్యార్థులకు గురువారం పురస్కారాలు అందచేశారు. నగరంలోని కస్తూరిదేవి పాఠశాల ప్రాంగణంలో ఉన్న రవీంద్రనాథ్ ఠాగూర్ సమావేశ మందిరంలో భక్తాని శ్రీనివాసులు, శ్రీలక్ష్మీ నరసింహ సీడ్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు, భవిష్యత్‌లో వారు మరింత ఉత్తమంగా రాణించేందుకు పురస్కారాలు దోహదపడతాయని చెప్పారు. అనంతరం శ్రీ గంగా సరస్వతి పురస్కారం పేరుతో విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు కొండూరు పాలిశెట్టి, పామంజి శేషయ్య, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్న ఎమ్మెల్సీ రవిచంద్ర

సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలి

● వీఆర్ఏల సంఘం

నెల్లూరు (వైద్యం), మే 15 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో గ్రామ సహాయకులు పాల్గొనాలని వీఆర్ఏల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పెంచల నర్సయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లచ్చయ్య పిలుపునిచ్చారు. గురువారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఎనిమిదేళ్లుగా వీఆర్ఏలకు ఒక్క రూపాయ కూడా వేతనాలు పెంచలేదన్నారు. వారసులుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా ప్రభుత్వం గుర్తించటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పక్కనున్న తెలంగాణలో వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులు గా గుర్తించి పే స్కేల్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోనూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమ్మెకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సమావేశంలో ఓబులేసు, వెంకట సుబ్బయ్య, బలరాం. బుచ్చయ్య, శశికుమార్, సుమన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మె కరపత్రాలు విడుదల చేస్తున్న వీఆర్ఏ సంఘం నాయకులు

అత్యాధునిక వసతులతో వీఆర్ హైస్కూల్ సిద్ధం

● ఏడాదికి వేయిమందికి ప్రవేశం ● పురపాలకశాఖ మంత్రి నారాయణ

నెల్లూరు(విద్య), మే 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఆర్ ఉన్నత పాఠశాలను నిరుపేద విద్యార్థుల కోసం అత్యాధునిక వసతులతో సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని వీఆర్ హైస్కూల్ ఆధునికీకరణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. వీఆర్ హైస్కూల్‌ను పునరుద్ధరిస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఏడాదికి వెయ్యి మంది చొప్పున ఐదేళ్లకు ఐదువేల మంది పిల్లలకు అడ్మిషన్స్ కల్పిస్తామని ప్రకటించారు. స్కూల్‌కు సమీపంలో ఉన్న 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తామని, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ప్రత్యేకంగా బస్సులు నడుపుతామని చెప్పారు. ప్రతీ విద్యార్థికి నిత్యం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్ర స్నాక్స్ ఉచితం గా అందించి నాణ్యమైన విద్యను బోధిస్తామని మంత్రి పేర్కొన్నారు. పాడుబడిన భవనాలను తొలగించి వాటి స్థానంలో క్రీడా సదుపాయాలు కల్పించి జూన్ 12న ప్రారంభించేలా వేగవంతంగా పనులు పూర్తి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే మోడల్ స్కూల్‌గా దీనికి గుర్తింపు తీసుకువచ్చేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, అధికారులు కూడా ఆ దిశగా పనులు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, మునిసిపల్ కమిషనర్ నందన్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీఆర్ హైస్కూలక్షలో పనులు పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, పక్కన జేసీ కార్తీక్, కమిషనర్ నందన్

పరిశ్రమలకు మురుగు శుద్ధినీరు

● నగర పాలక సంస్థ కమిషనర్ నందన్

నెల్లూరు రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రముఖ పరిశ్రమలకు నెల్లూరు నగరంలోని మురుగు నుంచి శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసేందుకు అందిన ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లు ఎన్ఎంసీ కమిషనర్ వైవో నందన్ తెలిపారు. గురువారం ఆయన చాంబర్‌లో ఏపీ పట్టణ మౌలిక సదుపాయాల యాజమాన్య సంస్థ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నగరంలోని అల్లీపురం, వెంకటేశ్వరపురం ప్రాంతాల్లో ఎస్టీపీల వద్ద శుద్ధి చేస్తున్న నీటిని కృష్ణపట్నం, జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు సరఫరా చేసే అంశం పరిశీలనలో ఉందని చెప్పారు. నగరానికి సమీప గ్రామాల్లో విశాలమైన మైదానాల్లో సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసి నగరానికి అవసరమైన విద్యుత్‌ను సరఫరా చేసే అంశం కూడా ప్రతిపాదించినట్లు తెలిపారు. వీటిపై త్వరలో నిర్ణయం తీసుకుంటా మన్నారు. అనంతరం మూడవ శనివారం స్వచ్ఛ కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు.

● పీఆర్వోగా కృష్ణకిషోర్

నెల్లూరు కార్పొరేషన్ పీఆర్వోగా కృష్ణకిషోర్‌ను నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులిచ్చారు. ప్రస్తుతం పీఆర్వోగా పనిచేస్తున్న కృష్ణారావు సెలవులోకి వెళ్లడంతో ఆ స్థానంలో కిషోర్‌ను నియమించారు.



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ నందన్

కనుల పండువగా ఏకాంతసేవ

● ముగిసిన విశ్వనాథుడి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు(సాంస్కృతికం), మే 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉస్మాన్ సాహెబ్‌పేటలో ఉన్న అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథ స్వామి బ్రహ్మోత్స వాల్లో గురువారం రాత్రి ఏకాంత సేవ వైభవంగా జరిగింది. ఉదయం స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. సాయంత్రం మూలవరులకు పూలంగిసేవ, విశేష పూజలు చేశారు. వీటితో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. చివరి రోజు ఉభయకర్తలుగా ఆలయ అర్చకుడు వందవాసి విశ్వనాథ గురుకుల్, గణేష్ గురుకుల్ వ్యవహరించారు. పత్తి జయరామయ్య నాయుడు, మోదెం మల్లికార్జున రావు, ఆడిటర్ రాఘవేంద్రరావు, ఆలయ మాజీ అధ్యక్షుడు కొలపర్తి రమేష్‌కుమార్, కామేశ్వరరావు పాల్గొన్నారు. ఆలయ ఈవో జీ దర్గయ్య పర్యవేక్షించారు.





చక్రత్తాళ్వారుతో తీర్థవాది ఉత్సవానికి కోనేర్ల వద్దకు వెళ్తున్న అర్చక బృందం, భక్తులు

వైభవంగా తీర్థవాది

నేటితో బ్రహ్మోత్సవాలు పూర్తి

వేదగిరి క్షేత్రంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో గురువారం తీర్థవాది ఉత్సవాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల ఉత్సవమూర్తులను, చక్రత్తాళ్వారును ఆలయం నుంచి మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలతో ఊరేగింపుగా ఏడు కోనేళ్ల వద్దకు తీసుకెళ్లారు. అక్కడ స్నపనం అనంతరం చక్రస్నానం ఘట్టాన్ని నిర్వహించారు. అనంతరం ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో ధ్వజావరోహణ గావించారు. ఈ కార్యక్రమాలలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి, ఈవో గోపి పాల్గొన్నారు.

- నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి)

కందుకూరులో రోడ్డెక్కిన పొగాకు రైతులు

- గిట్టుబాటు ధర లేదంటూ రాస్తారోకో



కందుకూరు, (ఆంధ్రజ్యోతి): పొగాకుకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, వ్యాపారులు రోజురోజుకి ధరలు దిగజారుస్తున్నారంటూ కందుకూరులో రైతులు ఆందోళన బాట పట్టారు. గురువారం వేలం ప్రక్రియ ప్రారంభమయ్యాక ధరలు దారుణంగా తగ్గిపోతున్నాయని గుర్తించిన రైతులు వేలంను నిలిపివేసి వేలం కేంద్రం బయట రోడ్డుపై బైఠాయించారు. దూబగుంట సమీపంలో ఉన్న కందుకూరు-1 వేలం కేంద్రంలో ఆందోళన చేపట్టిన రైతులు కందుకూరు - కనిగిరి ప్రధాన రహదారికి ట్రాక్టర్లు అడ్డంగా పెట్టి రాస్తా రోకో చేశారు. ఈ సందర్భంగా చెన్నిపాడు, బాలిరెడ్డిపాలెం రైతులు మాట్లాడుతూ అత్యంత నాణ్యమైన పొగాకుకు కూడా కిలోకు రూ.220 ధర ఇస్తున్నారని, మొన్నటివరకు రూ. 250 వరకు చెల్లించిన వ్యాపారులు ఒక్కసారిగా ధరల్లో కోత పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. వేలం ప్రారంభించిన సమయంలో నాణ్యమైన పొగాకుకు అత్యధిక ధర రూ.280 గా నిర్ణయించి కొనుగోళ్లు ప్రారంభించిన వ్యాపారులు కొద్దిరోజులు గడిచాక అతి కొద్ది బేళ్లకు మాత్రమే ఆ ధర చూపిస్తూ అత్యధిక శాతం నాణ్యమైన బేళ్లకు రూ.250లకే సొంతం చేసుకుంటున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం ఆ ధర కూడా లేకుండా దిగజార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారుల తీరులో మార్పు వచ్చి గిట్టు బాటు ధరలు ఇచ్చేవరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టంచేశారు. రైతుల ఆందోళనతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో పోలీసులు, బోర్డు అధికారులు రైతులకు సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు.

డెంగ్యూ వ్యాధి జిల్లా వాసులను ఆందోళనకు గురిచేస్తోంది. గత మూడేళ్లుగా డెంగ్యూ కేసుల నమోదు ప్రజలను కలవరపెడుతోంది. మరీ ముఖ్యంగా గడిచిన నాలుగు నెలలుగా ఏకంగా 100 కేసులకుపైగా అధికారికంగా నమోదు కావడం వ్యాధి తీవ్రతకు అద్దం పడుతోంది. వ్యాధి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నా డెంగ్యూ వ్యాధికి కారణమైన దోమల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుండటం గమనార్హం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెంగ్యూకు సరైన వైద్యం అందక పోవటంతో పేదలు సైతం ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీయాల్సిన పరిస్థితి వస్తోంది. ఇప్పటికే కొంత మంది మరణించగా పలువురు చికిత్స కోసం చెన్నై వంటి నగరాలకు వెళుతున్నారు.



4 నెలలు.. 100 కేసులు!

- జిల్లాలో పెరుగుతున్న డెంగ్యూ వ్యాధి
- నెల్లూరు నగరంలోనే ఎక్కువ
- అప్రమత్తంగా లేకపోతే ప్రాణాపాయమే!
- నేడు జాతీయ డెంగ్యూ నివారణ దినం

నెల్లూరు (వైద్యం), మే 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మండలాల్లో డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయి. నెల్లూరు నగరంలోనే ఎక్కువగా డెంగ్యూ కేసులు నమోదైనట్లు సమాచారం. కలువాయి మండలం, నెల్లూరు రూరల్, ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, బోగోలు, కలిగిరి, కావలిరూరల్, రాపూరు, ఆత్మకూరు, అల్లూరు తదితర మండలాల్లో ఇప్పటికే డెంగ్యూ జ్వర పీడితులు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. సాధారణ జ్వరంగా భావించి చికిత్స పొందుతున్న వ్యాధిగ్రస్తులు ఆఖరుకు డెంగ్యూ వ్యాధిగా నిర్ధారణ కావడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం డెంగ్యూ వ్యాధిని ర్యాపిడ్ పరీక్ష ద్వారా నిర్ధారించి వైద్య చికిత్సలు అందించాలి. అయితే వైద్య ఆరోగ్యశాఖ మాత్రం ర్యాపిడ్ పరీక్షలో గుర్తించిన డెంగ్యూను పరిగణలోకి తీసుకోమంటూ తేల్చి చెబుతోంది. డెంగ్యూ వ్యాధి నిర్ధారణకు ఎలీషా పరీక్ష తప్పనిసరి అంటోంది. ఈ పరీక్ష కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నా ఆ ఫలితాలను కూడా పరిగణలోకి తీసుకోమంటూ, కేవలం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితోపాటు కావలి, ఆత్మకూరు, కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్వహించే పరీక్షలకే ప్రామాణికమని వాదిస్తోంది. దీంతో వైద్యశాఖ తీరుపై వైద్యుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మరోవైపు ఎలీషా పరీక్షలు చేసేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎలాంటి ఏర్పాట్లు లేకపోవడం గమనార్హం.

గట్టి చర్యలు తీసుకుంటున్నాం



జిల్లాలో డెంగ్యూ వ్యాధి నివారణకు గట్టి చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం కేసుల నమోదు ఆందోళన కలిగిస్తోంది. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించి నీటి నిల్వలు లేకుండా, దోమలను లార్వా దశలోనూ నిర్మూలించేందుకు కృషి చేస్తున్నాం. డెంగ్యూ వ్యాధిపై ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నాం వ్యాధి గ్రస్తులకు అన్ని రకాల వైద్య చికిత్సలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

- హుస్సేనమ్మ, డెంగ్యూ నివారణ అధికారి

గత మూడేళ్లలో డెంగ్యూ కేసులు ఇలా...

సంవత్సరం	ప్రభుత్వం గుర్తించినవి	ప్రైవేట్ ఆసుపత్రుల్లో...
2021	26	125
2022	148	210
2023	139	250
2024	130	310
2025 (ఏప్రిల్ వరకు)	16	100

ఇదేంది సారూ..!

- వివాదాస్పదంగా ఇరిగేషన్ అధికారుల తీరు
- గత ప్రభుత్వంలోని వర్కులపై విజిలెన్స్ విచారణ
- పనులు చేయకనే బిల్లులు పెట్టుకున్నారని ఆరోపణలు
- ఇప్పుడు బిల్లుల కోసం హైకోర్టుకెళ్లిన వైసీపీ నేతలు
- కౌంటర్ వేయకుండా జిమ్మిక్కులు చేస్తున్న అధికారులు
- వారికి బిల్లులు ఇప్పించేందుకు ప్రయత్నాలు?

నెల్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో అక్రమార్కులకు ఇరిగేషన్ శాఖ ఒక కల్పతరువుగా మారింది. ఎక్కడైనా ఎంతో కొంత తక్కువ పనులు చేసి ఎక్కువ బిల్లులు పెట్టుకోవడం చూశారు గానీ ఇరిగేషన్ శాఖలో మాత్రం అసలు పనులు చేయకుండానే బిల్లులు పెట్టుకునే సంస్కృతికి బీజం పడింది. ప్రధానంగా ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనుల్లో భారీ అక్రమాలు జరిగినట్లు మొదటి నుంచీ ఆరోపణలున్నాయి. 2022లో ఏకంగా రూ.232 కోట్ల మేర ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్స్(ఎఫ్‌డీఆర్) కింద అనుమతులు ఇచ్చారు. వీటిలో చాలా పనులు 2019లోనే చేసినవి కావడం గమనార్హం. ఆ తర్వాత 2023లో ఓఅండ్ఎం వర్కులను మంజూరు చేయించి వాటిని ప్యాకేజీలుగా మార్చారు. ఒక్కో ప్యాకేజీలో పదుల సంఖ్యలో వర్కులు ఉన్నాయి. దీంతో ఏ వర్కు మంజూరైంది? ఏ వర్కు పూర్తి చేశారు? అన్న విషయాలు రైతులకు తెలియదు. అలానే కాంట్రాక్టర్ల మెయింటెనెన్స్ పీరియడ్‌ను కూడా తగ్గించేశారు. ఇక కొన్ని సీజన్లలో కాలువల్లో నీరు పారుతున్న సమయంలో ఓఅండ్ఎం పనులు జరిగినట్లు ఎంబుక్‌లు రికార్డు చేశారు. ఇలా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఇరిగేషన్ శాఖలో అనేక అవకతవకలు జరిగాయి. అప్పట్లోనే ప్రతిపక్ష పార్టీగా తెలుగుదేశం నేతలు ఈ అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తూ వచ్చారు. కానీ నాడు ఎవరూ పట్టించుకోలేదు.



● విజిలెన్స్ విచారణ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ ప్రభుత్వంలోని జరిగిన అక్రమాలపై ఎమ్మెల్యేలు దృష్టి పెట్టారు. నాడు పనులు చేయకుండానే బిల్లులు పెట్టిన అనేక వర్కులను బట్టబయలు చేశారు. వీటిపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీంతో వైసీపీ ప్రభుత్వంలో ఇరిగేషన్ శాఖలో జరిగిన ఓఅండ్ఎం, ఎఫ్‌డీఆర్ వంటి అనేక రకాల వర్కులపై విజిలెన్స్‌కు ఆదేశాలు వచ్చాయి. కొన్ని నెలల క్రితమే ఇరిగేషన్ శాఖ కార్యాలయాల నుంచి ఈ వర్కులకు సంబంధించిన రికార్డులను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం క్షేత్రస్థాయి విచారణ జరుపుతున్నారు. ఇప్పటికే చాలా చోట్ల అక్రమాలు బయటపడినట్లు తెలుస్తోంది. కాగా విజిలెన్స్ విచారణ పెండింగ్ ఉండగా సదరు వర్కులకు సంబంధించి బిల్లులు చెల్లించడం నిబంధనలకు విరుద్ధం. పనులు చేసినట్లు చెబుతున్న వ్యక్తులు కోర్టుకెళ్లినా.. ఇరిగేషన్ అధికారులు ఇందుకుగానూ కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. విజిలెన్స్ విచారణ పెండింగ్ ఉంది కాబట్టి అది పూర్తికాగానే ఆ నివేదిక ఆధారంగా బిల్లులు చెల్లిస్తామని ఇరిగేషన్ అధికారులు కోర్టుకు తెలియజేయాల్సి ఉంటుంది. అప్పుడే వాస్తవాలు కోర్టు దృష్టికి వెళతాయి. కానీ జిల్లాలోని కొందరు అధికారులు ఈ పని చేయడం లేదు. విజిలెన్స్ విచారణ జరుగుతున్న విషయాన్ని హైకోర్టుకు తెలియజేయడం లేదు. దీంతో అక్కడి నుంచి బిల్లులు ఎందుకు నిలుపుదల చేస్తారంటూ ప్రశ్నలు వస్తున్నా సమాధానం ఉండడం లేదు. ఫలితంగా బిల్లులు చెల్లించాలని ఆదేశాలు అందుతున్నాయి.

సీరియస్‌గా తీసుకుంటున్నాం

విజిలెన్స్ విచారణ జరుగుతున్న వర్కులకు సంబంధించి కొందరు బిల్లుల కోసం హైకోర్టును ఆశ్రయించారు. అయితే మా అధికారులు కొందరు సరైన కౌంటర్ వేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నాం. విజిలెన్స్ విచారణ జరుగుతున్న విషయాన్ని కోర్టుకు కౌంటర్ రూపంలో తెలియజేస్తాం.

- దేశానాయక్, ఇరిగేషన్ ఎస్‌ఈ

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టండి

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వైద్యం), మే 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సీజనల్ వ్యాధులపై దృష్టిపెట్టి వాటి నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో వైద్యాధికారుల సమక్షంలో జాతీయ డెంగ్యూ దినోత్సవ పోస్టర్లు విడుదల చేశారు. జిల్లాలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎక్కడైనా డెంగ్యూ కేసులు నమోదైతే వెంటనే ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలతో పాటు వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సీజన్‌లో డయేరియా, టైఫాయిడ్ వంటి కేసులు నమోదు కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, జిల్లా డెంగ్యూ నివారణ అధికారి హుస్సేనమ్మ, ఎన్‌హెచ్ఎం అధికారి డాక్టర్ రమేష్, డాక్టర్ బ్రహ్మనాయుడు, మలేరియా అదనపు అధికారి నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



డెంగ్యూ దినోత్సవ పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ ఆనంద్, అధికారులు

ఇంటర్ సప్లిమెంటరీకి 478 మంది గైర్హాజరు

నెల్లూరు(విద్య), మే 15 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో గురువారం మ్యాథ్స్- 1బీ, 2బీ, జువాలజీ-1, 2, హిస్టరీ-1, 2 పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 478 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షలకు 12,240 మంది హాజరు కావాల్సి ఉండగా 11,809 మంది హాజరుకాగా 431 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 1055 మంది హాజరు కావాల్సి ఉండగా 1008 మంది హాజరుకాగా 47 మంది గైర్హాజరయ్యారు. ఆర్‌ఐవో టీ వరప్రసాద రావు 18 కేంద్రాలు, డీఈసీ సభ్యులు 8, ఫ్లయింగ్ స్క్వాడ్ 27 కలిపి మొత్తం 53 కేంద్రాలను పరిశీలించారు.

21న పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా శాఖ నెల్లూరు రీజియన్, జోన్-3 పరిధిలో ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలాల లీజుకు సంబంధించి అవగాహన సదస్సు ఈ నెల 21వ తేదీన జరుగుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి మురళీబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండుపైన మొదటి అంతస్తులోని కాన్ఫరెన్స్ హాల్లో ఈ సదస్సు ఉదయం 11 గంటలకు జరుగుతుందన్నారు. ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (హరనాథపురం) : 'అందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా ఇంటి స్థలాల కోసం పేదలు దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఒక ప్రకటనలో కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్ల స్థలం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఇళ్ల స్థలాలు పొందిన వారికి రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, పట్టణ ప్రాంతాలలో టిడ్కో లేదా యూఎల్‌బీ ఇళ్లు మంజూరు చేస్తాయని తెలిపారు. ఒకసారి స్థలం పొందిన వారు తిరిగి పొందకుండా ఆధార్, రేషన్ కార్డు స్థలానికి లింకు చేస్తారని అన్నారు. ఈ పథకం కింద ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాలలో 1,221 దరఖాస్తులు, పట్టణ ప్రాంతాలలో 417 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

రాష్ట్ర చెస్ విజేత శ్రీరామ్ చౌదరి

నెల్లూరు(విద్య), మే 15 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరుకు చెందిన శ్రీరామ్ చౌదరి రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో విజేతగా నిలిచినందుకు రాష్ట్ర చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి వై సుమన్ అభినందించారు. జిల్లా చెస్ అసోసియేషన్, చిల్డ్రన్స్ పార్కులోని కురుక్షేత్ర చెస్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముత్తుకూరు అదానీ పాఠశాలలో 7వతరగతి చదువుతున్న ఉన్నం శ్రీరామ్ చౌదరి కావలిలో జరిగిన రాష్ట్ర చెస్ పోటీల్లో అండర్-13 విభాగంలో చాంపియన్‌గా నిలిచాడన్నారు. రేటింగ్ ప్లేయర్స్‌తో పోటీపడి విజేతగా నిలవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు జే భరత్‌కుమార్, ఎస్ వెంకటేష్, తల్లిదండ్రులు విజయలక్ష్మి, కిరణ్ చౌదరి, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారుడిని అభినందిస్తున్న రాష్ట్ర చెస్ సంఘం కార్యదర్శి సుమన్

పొట్టేపాళెం, ములుముడి కలుజుల వద్ద

వంతెన నిర్మాణాలకు నిధులిస్తాం!

- డిసెంబరు కల్లా యూడీఎస్, తాగునీటి పనుల పూర్తి
- రాష్ట్ర మంత్రి నారాయణ వెల్లడి
- 26 డివిజన్లలో 339 అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

నెల్లూరురూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ పరిధిలోని పొట్టేపాళెం, ములుముడి కలుజుల వద్ద వంతెన నిర్మాణాలకు త్వరలో నిధులు మంజూరు చేయిస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. గురువారం ఉదయం నెల్లూరురూరల్ పరిధిలోని 26 డివిజన్లలో రూ.41 కోట్లతో పూర్తి చేసిన 339 అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, జిల్లా ఉన్నతాధికారులు ప్రారంభించారు. కల్లూరిపల్లి హౌసింగ్ బోర్డుకాలనీలో పలు అభివృద్ధి పనులను మంత్రితోపాటు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నెల్లూరురూరల్లో రూ.231 కోట్లతో 816 అభివృద్ధి పనులు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ లెక్కన రాష్ట్రంలో మరెన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయో అర్థమవుతుందని చెప్పారు. గత ప్రభుత్వం తమపై కోపంతో నెల్లూరులో 90 శాతం పూర్తయిన యూజీడీ, తాగునీటి పనులు ఆపేసిందని వాటిని డిసెంబరుకు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ శ్రీధర్‌రెడ్డిని మిగిలిన ఎమ్మెల్యేలు ఆదర్శంగా తీసుకుని ఇదే తరహాలో పనులు చేయించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ బీద మాట్లాడుతూ వినూత్న కార్యక్రమాలకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కేరాఫ్ అన్నారు. అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపించారని తెలిపారు.



అభివృద్ధి పనుల ప్రారంభం అనంతరం మాట్లాడుతున్న మంత్రి నారాయణ

● సిందూర్ అమరులకు అంకితం

పాకిస్థాన్‌పై పోరులో భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో అమరులకు ఈ అభివృద్ధి పనులన్నీ అంకితం చేస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు నెల్లూరురూరల్లో చేసింది గోరంతైతే చేయాల్సింది కొండంత ఉందన్నారు. పొట్టేపాళెం, ములుముడిల వద్ద వంతెనలు, బీసీభవన్, జగ్జీవన్‌రాం భవన్‌లకు నిధులు సమకూర్చాలని కోరారు. కాగా, 35వ డివిజన్ లేక్‌వ్యూ కాలనీ వద్ద పలు అభివృద్ధి కార్యక్రమాలను జేసీ కార్తీక్, ఎస్పీ కృష్ణకాంత్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ప్రారంభించారు. మేయర్ స్రవంతి, కమిషనర్ నందన్, ఎంహెచ్‌వో చైతన్య, మాజీ మేయర్ భానుశ్రీ, కార్పొరేటర్ అరవ శాంతి, నాయకులు శ్రీను, రామచంద్ర పాల్గొన్నారు.



చలంచర్ల చెరువులో నరికేసిన జామాయిల్ చెట్లు

చలంచర్ల చెరువులో కలప దొంగలు

- రెండు ట్రక్కుల జామాయిల్ కర్ర తరలింపు
- టీడీపీ సీనియర్ నేత నిర్వాహకమన్న గ్రామస్థులు


కావలి రూరల్, మే15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చలంచర్ల చెరువులో కలప దొంగలు పడ్డారు. ట్రాక్టర్‌తో రెండు ట్రక్కుల జామాయిల్ కర్రను దొంగిలించుకు పోయినట్లు గ్రామస్థులు తెలిపారు. జామాయిల్ కర్రకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో చెరువులో ఉన్న జామాయిల్‌పై అధికారపార్టీకి చెందిన సీనియర్ నాయకుడి కన్ను పడింది. ఇది ఆయన నిర్వాహకమేనని గ్రామస్థులు గుర్తించారు. చెరువు అంచున గుంట కట్టకు చుట్టూ ఉన్న సుమారు 15 టన్నుల జామాయిల్ కర్రను తరలించి సుమారు రూ. 50వేల వరకు సొమ్ముచేసుకున్నట్లు వారు తెలిపారు. చెరువులో రూ. లక్షల విలువ చేసే కర్రతుమ్మ చెట్లను, చెరువు కట్టపై ఉండే చిల్లకర్ర చెట్లను నరకకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. జామాయిల్ కర్రను నరికి సొమ్ము చేసుకున్న నేత నుంచి నగదు రికవరీ చేయాలని వారు కోరుతున్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

- రూ. 88 వేల నగదు, 5 బైకుల స్వాధీనం

ఏఎస్ పేట, మే 15 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 88680 నగదు, 5 బైకులు, 6 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. గురువారం చిరమన సమీపంలోని పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో తన సిబ్బందితో కలసి దాడిచేసి అరెస్టు చేసిన్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉంగరం సంగతి తెలుస్తుందని ఊపిరి తీసుకున్నాడు



పొదిలి శ్రీనివాసులు మృతదేహం

నెల్లూరు రూరల్, మే 15,(ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన ఓ వ్యక్తి తన కూతురు వద్ద బంగారు ఉంగరం తీసుకున్న విషయం ఇంట్లో తెలిసిపోతుందేమోనన్న ఆందోళనతో బలవన్మరణానికి పాల్పడ్డ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు అందించిన వివరాల మేరకు.. నవలాకులతోట మంగళదిబ్బ వద్ద నివాస ముంటున్న పొదిలి శ్రీనివాసులు (39)కు భార్య ఇద్దరు కుమార్తెలున్నారు. మద్యానికి బానిసైన అతను ఒక కుమార్తె చేతికి ఉన్న బంగారు ఉంగరాన్ని తీసుకుని అమ్మి దాంతో వచ్చిన నగదుతో కొన్ని రోజులుగా మద్యం తాగుతున్నాడు. ఇంట్లో నగదు అడగకుండా రోజూ మద్యం ఎలా తాగుతున్నాడని అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు ఆ విషయం ప్రశ్నిస్తే ఉంగరం విషయం తెలిసిపోతుందని ఆందోళనకు గురైన శ్రీనివాసులు బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరేసుకున్నాడు. కొంత సమయానికి గమనించిన కుటుంబ సభ్యులు అతడిని హుటాహుటిన నెల్లూరులోని హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

22న హనుమాన్ జయంత్యుత్సవాలు

ఉదయగిరి, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయం ఆవరణలో ఇటీవల నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 22వ తేదీన హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు, అలంకరణలు ఆకు, సింధూర పూజలు నిర్వహించనున్నట్లు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8914
వెండి కిలో ధర	రూ. 97,300
వెండి ఒక గ్రాము	రూ. 100.30

పక్కా గృహాల నిర్మాణం వేగవంతం

● ఎండీ గౌస్‌మొహిద్దీన్, ఏఈ



సంగం, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ దశల్లో ఉన్న పక్కా గృహాల నిర్మాణం వేగవంతం చేసి పూర్తి చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు గృహ నిర్మాణ శాఖ ఏఈ గౌస్ మొహిద్దీన్ తెలిపారు.

? జూన్ 12 నాటికి ఎన్ని గృహాలు పూర్తిచేసి ప్రారంభించనున్నారు.

! 246 పక్కాగృహాలు పూర్తిచేసి ప్రారంభించాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పటికి 119 ఇళ్ల పూర్తయ్యాయి. 127 ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. గడువులోపు పూర్తిచేస్తాం.

? లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు, సామగ్రి అందుతుందా.

! కూటమి ప్రభుత్వంలో బిల్లులు అప్‌లోడ్ చేసిన వారం లోపు లబ్ధిదారుని ఖాతాలో జమ అవుతున్నాయి. సిమెంట్, కమ్మి గోడౌన్‌లో అందుబాటులో ఉంది. లబ్ధిదారులు అడిగిన వెంటనే ఇస్తున్నారు. ఎటువంటి ఇబ్బంది లేదు.

? కూటమి ప్రభుత్వం ప్రకటించిన అదనపు సాయం ఎలా ఇస్తున్నారు.

! లబ్ధిదారులు ఇంటికి శ్లాబు వేసి నిర్దేశించిన పనిచేసిన తరువాతనే విడతల వారీగా బిల్లుల రూపంలో అదనపు సాయం జమ అవుతుంది. ఎస్సీ, బీసీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేల చొప్పున ఇస్తారు.

? వైసీపీ హయాంలో థర్డ్ పార్టీ నిర్మించిన ఇళ్ల నిర్మాణాల పరిస్థితి ఏమిటి.

! మండలంలో వైసీపీ పాలనలో ఎక్కువ శాతం థర్డ్ పార్టీ కాంట్రాక్టర్లే ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం అన్ని నిర్మాణాలు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేశారు. భారీగా అవినీతి, అక్రమాలు జరిగాయి. వాటిపై ఎటువంటి ఆదేశాలు రాలేదు.

న్యూస్ బాక్స్

ఎస్సీ సబ్సిడీ రుణాల దరఖాస్తులు పరిశీలన



దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

ఏఎస్ పేట, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించే సబ్సిడీ రుణాల కోసం వచ్చిన దరఖాస్తులను గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ప్రసాద్ ఆధ్వర్యంలో పరిశీలించారు. మొత్తం 11మందికి గాను 62మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 48మంది పరిశీలన కార్యక్రమానికి హాజరు కాగా, వారి దరఖాస్తులను పరిశీలించామని త్వరలో అర్హులైన వారిని ఎంపిక చేసి జాబితా తయారు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మేనేజర్లు వెంకటేశ్వరరావు, తిలక్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దుత్తలూరులో వర్షం

దుత్తలూరు(ఉదయగిరి), మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండవేడిమితో అల్లాడిన ప్రజలు సాయంత్రం వర్షం కురవడంతో ఉపశమనం పొందారు. ఈ వర్షం ఉద్యాన పంటల సాగు రైతులకు కొంత ఊరటనిచ్చింది.

●ఉదయగిరి రూరల్ : ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో గురువారం ఒక్కసారిగా ఆకాశంలో మబ్బులు కమ్ముకొని చల్లని గాలులు వీయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఉరుములు, మెరుపులతో కొంతసేపు బీభత్సం సృష్టించాయి. దీంతో ఏ క్షణంలో ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు బెంబేలెత్తిపోయారు.

ఆత్మకూరు సీఐకి సన్మానం



సీఐని సత్కరిస్తున్న లక్ష్మీదేవి

అనంతసాగరం, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మవరం సర్పంచు కే లక్ష్మీదేవి గురువారం ఆత్మకూరు సీఐ గంగాధర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా సీఐని శాలువతో సత్కరించి స్థానిక సమస్యలు ఆయనకు వివరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఏ పి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి వనరుల మరమ్మతులకు శ్రీకారం

● పూడిక మట్టి తరలింపునకు అనుమతులు

ఉదయగిరి, మే 15 (ఆంధ్రజ్యోతి): సాగునీటి వనరుల మరమ్మతులకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చెరువులు, కాలువల్లో పూడికతీత దిశగా అడుగులేసింది. పూడిక మట్టిని వ్యవసాయ పొలాలకు తరలించేందుకు అనుమతులిచ్చింది. రైతులే సొంత ఖర్చులతో సమీప చెరువులు, కాలువల నుంచి పూడిక మట్టి తోలుకునే వెసులుబాటు కల్పించింది. ప్రస్తుత వేసవిలో ఈ పనులు చేపడితే రానున్న వర్షాకాలం నాటికి ప్రయోజనం చేకూరుతుందని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొంది.



ట్రాక్టర్‌లో మట్టి నింపుతున్న ఎక్స్‌కవేటర్

రైతులకు ప్రయోజనకరం

సాగుచేసే భూముల్లో చెరువు మట్టిని తోలితే రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. చెరువుల్లో సారవంతమైన మట్టి ఉంటుంది. ఈ మట్టి వ్యవసాయ భూమికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. మట్టితోపాటు సేంద్రీయ ఎరువులను కలిపి వేసుకుంటే రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు. దీంతో భూములకు పోషక విలువలతో మొక్కలు ఏపుగా, ఆరోగ్యంగా పెరుగుతాయి. కలుపు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే శక్తిని నేలకు అందిస్తుంది. దీంతో నేల సారవంతమై మంచి దిగుబడి వస్తుంది. జిల్లాలో మెట్ట ప్రాంతాలైన సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, మర్రిపాడు, కొండాపురం, వింజమూరు, కలిగిరి, ఏఎస్‌పేట, మర్రిపాడు, కందుకూరు, వలేటివారిపాళెం తదితర మండలాల పరిధిలోని ఎర్రరాతి, చౌడు నేలలు ఎక్కువగా ఉంటాయి. వీటిల్లో సేద్యం చేసేందుకు రైతులు ఇబ్బందులు పడుతుంటారు. ఈకారణంగా చాలా మంది రైతులు భూములను బీళ్లుగా వదిలేశారు. అలాంటి భూములకు చెరువు మట్టి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

అనుమతులు పొందాలి

కాగా, చెరువులు, కాలువల నుంచి వ్యవసాయ పొలాలకు రైతులు మట్టి తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అవసరమైన రైతులు సంబంధిత భూ పత్రాలను సమర్పించి అనుమతులు పొందాలని జలవనరుల శాఖ ఈఈ జి వెంకటేశ్వర్లు తెలిపారు. క్యూబిక్ మీటర్‌కు రూపాయి చెల్లించి రైతుల సొంత ఖర్చులతో పొలాలకు మట్టిని తరలించుకోవచ్చునని తెలిపారు.

పాఠ్య పుస్తకాల పరిశీలన



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీనివాసులు

ఉదయగిరి, మే 15(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర పథకంలో భాగంగా ప్రభుత్వం మండలానికి పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలను గురువారం ఎంఈవో-2 తోట శ్రీనివాసులు సీఆర్‌ఎంటీలతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు తొలివిడతగా 14,004 పాఠ్యపుస్తకాలు ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. అన్ని పుస్తకాలు వచ్చిన తరువాత ప్రధానోపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు భోగ్యం శ్రీనివాసులు, షేక్ మొహిద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ మరమ్మతుల పరిశీలన

సీతారామపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ మరమ్మతు పనులను గురువారం ఏఎస్‌డబ్ల్యూవో కె ఆదిలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు వేగవంతం చేసి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకోవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, హాస్టల్ వార్డెన్ రమణారెడ్డి ఉన్నారు.

సోమశిలలో 47.682 టీఎంసీల నీరు

అనంతసాగరం మే 15 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారం నాటికి 47.682 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెన్నా డెల్టాకు 5,730, ఉత్తర కాలువకు 100, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల సరఫరా చేస్తున్నారు.



ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్

● పొంచి ఉన్న ప్రమాదం

ఉదయగిరి రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండి పాళెం గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండడంతో ఏ క్షణంలో ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు బెంబేలెత్తి పోతున్నారు. ఫీజు క్యారియర్లు లేకపోవడంతో పాటు దిమ్మె సైతం శిథిలావస్థకు చేరడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. అంతేగాక ఆప్రాంతంలో ప్రమాదకర మలుపు ఉండడంతో వాహనాలు ఎదురుపడిన సమయంలో వాహనదారులు, ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ముందుకు సాగాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రివేళలో ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామంలో నీటి సమస్య పరిష్కరించాలి

● ఎమ్మెల్యే కాకర్లకు బోడసిద్దాయపల్లి వాసుల మొర



ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు నీటి సమస్యను వివరిస్తున్న గ్రామస్థులు

సీతారామపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బోడసిద్దాయపల్లి గ్రామంలో నీటిసమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కు గ్రామస్థులు విన్నవించారు. గురువారం గ్రామంలో ఓ వివాహ వేడుకకు ఎమ్మెల్యే కాకర్ల కూటమి నేతలతో కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా గ్రామంలోని మహిళలు నీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లగా వెంటనే అక్కడి నాయ కులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు, మండల టిడిపి నాయకుడు కానాల సిద్దయ్య, జనసేన నాయకుడు భోగినేని కాశీరత్తయ్య, మాజీ జడ్పిటిసి కలివెల జ్యోతి, ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ బాబు, సర్పంచ్ ఆది నారాయణ, బూత్ ఇన్‌చార్జ్ మాల్యాద్రి, పాల్గొన్నారు.

కంప్యూటరీకరణ పనులు వేగవంతం చేయండి



కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న గుర్రప్ప

ఉదయగిరి, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వ్యవసాయ పరపతి సంఘాల్లో కంప్యూటరీకరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కోఆపరేటివ్ అధికారి బీ గుర్రప్ప పేర్కొన్నారు. గురు వారం స్థానిక కొట్టాలపల్లి సొసైటీ కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని సహకార సంఘాల సీఈవోలు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీల్లో కంప్యూటరీకరణ పనులను వేగవంతంచేసి రైతులు ఆన్‌లైన్ ద్వారా తమ లావాదేవీలను చేసుకునేలా చూడాలన్నారు. సొసైటీల్లో రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించేలా సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. సీఈవోలు రుణాల రికవరీ లక్ష్యాలను నూరుశాతం సాధించేలా కృషి చేయాలన్నారు. సొసైటీల వారీగా ప్రగతిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సమావేశంలో కావలి డివిజన్ సహకార అధికారి తిరుపాల్ రెడ్డి, ఉదయగిరి సబ్ డివిజన్ సహాయాధికారి శ్రీనివాసరెడ్డి, ఎన్‌డీసీసీబీ మేనేజర్ రాజశేఖర్, సూపర్‌వైజర్ మదీహ, సీఈవో పోలయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లు, రేషన్‌కార్డుల కోసం గిరిజనుల నిరసన



నిరసన తెలుపుతున్న గిరిజనులు

అనంతసాగరం మే 15 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులు, పెన్షన్లు మంజూరు చేయాలని స్థానిక గిరిజన కాలనీలో గురువారం సీపీఎం ప్రధాన కార్యదర్శి వెంకటేష్ ఆధ్వర్యంలో గిరిజనులు నిరసన చేశారు. ఈసందర్భంగా అర్హులను గుర్తించి వారి జాబితాను అధికారులకు అందజేశారు. కాలనీలో చాలా మందికి ఆధార్ కార్డులు కూడా లేవని వాపోయారు. కార్యక్రమంలో సీపీఎం గిరిజన శాఖ సభ్యులు అంకయ్య, బాలేష్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జుల పాలనతో అభివృద్ధికి నోచుకోని పల్లెలు

ఉదయగిరి, మే 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 46 మండలాలు ఉండగా 19 మండలాలకు ఇన్‌చార్జి ఎంపీడీవోలే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు అవరోధం ఏర్పడుతోంది. ప్రగతి పనులూ ముందుకు సాగడంలేదు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణ చాలా కీలకమైంది. మరోవైపు వ్యవసాయ సీజన్ పూర్తి కావడంతో గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ తరుణంలో ఎంపీడీవోలు గ్రామ సందర్శనకు వెళ్లి స్థానిక సమస్యలపై ఆరా తీసి పరిష్కారం దిశగా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇవ్వాలి. అయితే అధికశాతం మండలాలకు ఇన్‌చార్జులే కొనసాగుతుండడంతో గ్రామాల్లోని పనులపై పర్యవేక్షణ కొరవడింది. ఉపాధి పనుల్లో కొందరు క్షేత్ర సహాయకులు అవకతవకలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నా పట్టించుకొనే వారు కరువయ్యారు.

19 మండలాలకు ఇన్‌చార్జిలే దిక్కు

ఉమ్మడి జిల్లాలో 46 మండలాలు ఉండగా 19 మండలాలకు ఇన్‌చార్జి ఎంపీడీవోలు దిక్కు. ప్రధానంగా ఉదయగిరి, వరికుంటపాడు, పొదలకూరు, నెల్లూరు రూరల్, అనంతసాగరం, కలువాయి, సైదాపురం, డక్కిలి, చిట్టమూరు, కోట, ఓజిలి, సూళ్లూరుపేట తదితర మండలాలకు ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు.

అధ్వానంగా గ్రామాల లింకు రోడ్లు

● గ్రామస్థులు, వాహనదారుల అవస్థలు



అధ్వానంగా ఉన్న రాజులపాడు రహదారి

మర్రిపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలకు వెళ్లే లింకు రోడ్లన్నీ గుంతల మయమై అధ్వానంగా మారడంతో గ్రామస్థులు, వాహన దారులు అవస్థలు పడుతున్నారు. మర్రిపాడు మండలంలో దెబ్బతిన్న రహదారులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం చొరవ చూపింది. ఇటీవల మండలంలో రూ. 83లక్షలతో అరకొర పనులు చేసి గుంతలు పూడ్చి గుత్తేదారులు చేతులు దులుపుకున్నారు. మరమ్మతుల కోసం అప్పుడు అధికారులు అంచనాలు తక్కువ వ్యయంతో తయారు చేయడంతో గుంతలు పూడ్చి శాశ్వత పనులు చేయలేదని పంచాయతీరాజ్ ప్రాజెక్ట్ అధికారులు చెబుతున్నారు. చాబోలు-వెంకటాపురం రోడ్డుకు రూ. 13లక్షలు, వెంకటాపురం-కంపసముద్రం రోడ్డుకు రూ. 61లక్షలు, రాజులపాడు బూదవాడ రోడ్డుకు రూ. 29లక్షలు, పొంగూరు కండ్రి-నెర్దనంపాడు రోడ్డుకు రూ. 23లక్షలతో పనులు చేశారు. రాజులపాడు-బూదవాడ రోడ్డుకు 6.6 కిలోమీటర్ల మరమ్మతుల కోసం రూ. 29లక్షలు నిధులు మంజూరవ్వగా అవి సరిపోనందున ఒక్క కిలోమీటర్ పనులు చేశామని అధికారులు తెలిపారు. మిగతా రోడ్డు అంతా గతుకులుగానే ఉంది. కంకర చిప్స్, బూడిద పొడితో గుంతలు పూడ్చారే తప్ప పూర్తిగా మరమ్మతులు చేయలేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇరుకైన రోడ్లు కావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కాగా, మండలంలో రోడ్ల పరిస్థితిపై ఆరాతీసిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మండలంలో రోడ్ల మరమ్మతులకు ఆదేశించడంతో, మండలంలో 22రోడ్లకు మరమ్మతులు చేసేందుకు రూ. 38.73 కోట్లతో అంచనాలు తయారుచేసి ప్రతిపాదనలు పంపినట్లు మండల పంచాయతీరాజ్ ప్రాజెక్ట్ ఏఇ మవేకొరెడ్డి తెలిపారు.

C.R.I.M.E N.E.W.S

గోపాల్‌రెడ్డి నగర్‌లో వ్యక్తి దారుణహత్య

● ఆస్తి వివాదాలే కారణమంటున్న భార్య, బంధువులు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ డీఎస్పీ శివప్రియ, సీఐ సుధాకర్‌రెడ్డి



హత్యకు గురైన మల్లికార్జునరెడ్డి (ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం, మే15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రెడ్డి నగర్‌లో బుధవారం రాత్రి ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. హత్యకు గురైంది సోము మల్లికార్జున రెడ్డి అని తెలుసుకున్న బుచ్చి, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు గురువారం ఉదయం హత్య జరిగిన పొలాల వద్దకు చేరుకున్నారు. ఈ హత్యకు ఆస్తి వివాదాలే కారణమని మృతుడి భార్య, బంధువులు ఆరోపిస్తున్నారు. కాగా ట్రైనీ డీఎస్పీ శివప్రియ, ఇన్‌చార్జి సీఐ సుధాకర్‌రెడ్డి ,ఎస్‌ఐ సంఘటనా స్థలానికి చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. హత్యకు గల కారణాలపై రైతులు, బంధువులను విచారించారు. జాగిలాలతో పోలీసులు ఆప్రాంతంలో పలుచోట్ల తిరిగారు. మృతుడి భార్య సోము సుకేసిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఆమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

● దుక్కిదున్ని వస్తానని వెళ్లి...

పొలంలో వరినాట్లు వేసేందుకు ట్రాక్టర్‌తో దుక్కి చేసి వస్తానని చెప్పి బుధవారం సాయంత్రం 3 గంటలకు పొలానికి వెళ్లిన భర్త రాత్రి 8 గంటలైనా ఇంటికి రాలేదు. దీంతో భార్య సుకేసిని రాత్రి 10.30 వరకు పదేపదే ఫోన్లు చేసింది. ఎంతకీ లిఫ్ట్ చేయకపోవడంతో సమీప బంధువు, వాచ్‌మన్‌ను తీసు కుని పొలానికి వెళ్లింది. అక్కడ షెడ్డు పక్కనే కాలువకట్టపై భర్త నెత్తుటి మడుగులో పడిఉండడంతో కన్నీరుమున్నీరైంది. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భర్తను చం పింది ఆయన తమ్ముడు రామచంద్రారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులేనని సుకేసిని ఆవేదన వ్యక్తం చేసింది. ఇటీవల తమ పొలంలో మోటార్లు ధ్వంసం చేయడం, పైపులైన్లు కోసేయడం, టెంకాయ చెట్లు నరకేయడం... ఎంత కసితో చేశారో తన భర్తను కూడా అదే కసితో చంపారని రోదించింది. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

● సీఐ వల్లే ఇవన్నీ...

బుచ్చిలో క్రైంరేట్ పెరగుతున్నా సీఐ శ్రీనివాసులురెడ్డి పట్టించుకోకపోవడం వల్లే హత్యలు జరుగుతున్నాయని ట్రైనీ డీఎస్పీ ముందు ఓ వ్యక్తి వాపోయాడు. మరొకరు మర్డర్ జరగకుండా చూడాలని కోరారు. రూరల్ డీఎస్పీ చెప్పినా కేసు నమో దు చేయడంలేదని పేర్కొన్నారు.

● 30 ఏళ్ల తరువాత మళ్లీ..

గత 30 ఏళ్లుగా ప్రశాంతంగా ఉన్న బుచ్చి మండలంలో వరుస హత్యలు, కిరాయి హత్యలు, రౌడీమూకల ఆగడాలతో ప్రజలు ఉలికిపాటుకు గురవుతున్నారు. గత ఐదు నెలల్లోపు బుచ్చి మండలంలో మూడు హత్యలు చోటుచేసుకున్నాయి. ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించి బుచ్చిలో నేరాలు అదుపు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చికెన్ వ్యర్థాల వాహనాల పట్టివేత

● కేసు నమోదు



చికెన్ వ్యవర్థాలను గుంటల్లో వేసి పూడ్చివేస్తున్న పోలీసులు, మత్స్యశాఖ అధికారులు

సంగం, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంబయి జాతీయ రహదారిపై వెళ్తున్న రెండు చికెన్ వ్యర్థాల వాహనాలను గురువారం పోలీసులు, మత్స్యశాఖ అధికారులు పట్టుకున్నారు. ఈ వాహనాల్లో సుమారు 50 డమ్ముల్లో చికెన్ వ్యర్థాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీటిని స్థానిక కొండ దిగువ ప్రాంతంలో గుంట తీసి అందులో పూడ్చివేశారు. రెండు వాహనాల డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమృత్ పైలాన్ ధ్వంసం కేసులో పోలీసు కస్టడీకి నలుగురు నిందితులు

కావలి, మే15(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అమృత్ పథకం పైలాన్‌ను ధ్వంసం చేసిన కేసులో అరెస్ట్ అయి, సబ్‌జైలులో ఉన్న నలుగురు నిందితులను గురువారం పోలీసులు తమ కస్టడీకి తీసుకున్నారు. ఈ కేసులో 12 మంది నిందితులను గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు. వారిలో జర్నలిస్టులు, యూట్యూబర్లు కుర్రు శ్రీనివాసరావు, కేదారి కొండయ్య, బీవీ లక్ష్మీనారాయణ, టీ. ప్రసాద్‌ను అరెస్ట్ చేసి జైలుకు పంపిన విషయం తెలిసిందే. ఈ కేసులో మరింత సమాచారం రాబట్టేందుకు పోలీసులు కోర్టు ద్వారా వారిని రెండు రోజులు కస్టడీకి తీసుకున్నారు. గురువారం నలుగురిని పోలీసులు విచారించారు. శుక్రవారం కూడా విచారణ చేపట్టనున్నారు. ఈ కేసులో ఇంకా ఎవరెవరు ఉన్నారో.. వారందరి వివరాలు బయటకు వస్తాయని వైసీపీ నేతలు భయందోళన చెందుతున్నారు. సుమారు 30 మంది వరకు ఉండవచ్చనే ప్రచారం జరుగుతుండడంతో ఈ కేసులో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధాలు ఉన్న వారంతా ఎక్కడ తమ పేర్లు బయటకు వస్తాయోనని ఆందోళన చెందుతున్నారు.

ఆటోలో నుంచి పడి యువకుడి మృతి

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు కింద పడి కోనా రవికుమార్(36)మృతి చెందా డు. ఈ సంఘటన కావలి మండలం తుమ్మలపెంట సమీపంలో గురువారం జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు, మండలంలోని కొత్తసత్రానికి చెందిన రవికుమార్ ఆటోలో కావలి నుంచి గ్రామానికి వెళ్తూ జారి పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250
కోడిగుడ్ల ధర (100): 515	

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చేయాలి

వలేటివారిపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో నరేంద్రదేవ్ తెలిపారు. మండలంలోని బడేవారిపాలెం గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టరును పరిశీలించారు. సిబ్బంది అందరూ సకాలంలో విధులకు హాజరైనట్లు తెలిపారు ప్రతి ఉద్యోగి ఫీల్డ్‌లోకి వెళ్లేటప్పుడు మూమెంట్ రిజిస్టరులో ఎక్కడికి వెళ్తున్నది కారణం నమోదు చేసి వెళ్లాలని తెలిపారు.


హాజరును పరిశీలిస్తున్న ఎంపీడీవో

జనరల్ సర్జన్ పోస్టు భర్తీతో మెరుగైన సేవలు

● డాక్టర్ హరీష్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్



ఉలవపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 30 పడకల సీహెచ్‌సీలో జనరల్ సర్జన్ పోస్టు భర్తీ చేస్తే మెరుగైన వైద్యసేవలు అందిచవచ్చని సూపరిండెంటెంట్ డాక్టర్ హరీష్ తెలిపారు. స్పెషలిస్టు డాక్టర్లతోపాటు ముగ్గురు జూనియర్ డాక్టర్లు ఉన్నారు. ఎక్స్‌రే, ల్యాబ్, ఆధునిక పరికరాలతో కూడిన ఆపరేషన్ థియేటర్ వంటివి ఉన్నాయి. నిత్యం సుమారు 150 మంది రోగులను చూస్తుంటామని ఆయన తెలిపారు.

? : సీహెచ్‌సీలో ప్రజలకు ఎలాంటి సేవలు అందిస్తారు.

! : చిన్నపిల్లలతోపాటు సాధారణ రోగులకు వైద్య చికిత్సలు అందిస్తున్నాం. ఎమర్జెన్సీ డెలివరీ, రోడ్డు ప్రమాదాల కేసులు కూడా చూస్తుంటాం.

? : గైనకాలజిస్టు లేరు కదా.. అత్యవసర కాన్పుల పరిస్థితి ఏమిటి.

! : గత నెలలో కందుకూరు నుంచి డాక్టర్ సుగుణకుమారిని నియమించారు. ఆమె సెలవుపై వెళ్లినందున సాధ్యమైనంత వరకు డ్యూటీ డాక్టర్లు, స్టాఫ్ నర్సులు సాధారణ కాన్పుకు ప్రయత్నిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కందుకూరు, ఒంగోలుకు తరలిస్తున్నాం.

? : అత్యవసర మందులు అందుబాటులో ఉన్నాయా ?

! : గుండెపోటుతో ఆసుపత్రికి వచ్చిన వ్యక్తులకు ఈసీజీ, రక్త పరీక్షలు చేస్తాం. టెనెక్టిప్లేజ్ ఇంజక్షన్ అందుబాటులో ఉంది. అలాగే తేలు, పాము, కుక్క కాట్లకు కూడా మందులు అందుబాటులో ఉన్నాయి.

రూ. కోట్ల ఆస్తులున్నా... ఆదాయం సున్నా!

● విశేష పూజలు చేయలేమని పూజారుల మెలిక ● ఆలయ వ్యవహారాలు తమకే అప్పగించాలని డిమాండ్
● వారి తీరుపై సర్వత్రా విమర్శలు ● అంకమ్మ ఆలయంలో విచిత్ర పరిస్థితి


పునర్నిర్మాణం జరిగిన గ్రామదేవత అంకమ్మ ఆలయం


అంకమ్మ ఆలయ స్థలం ఆక్రమించి నిర్మించిన దుకాణాలు

కందుకూరు, మే 15(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత అంకమ్మ ఆలయ పునఃనిర్మాణం వైభవంగా జరుగుతున్నా నిర్వహణ పట్ల భక్తుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. రూ.కోట్లు వెచ్చించి ఆలయ పునర్నిర్మాణం, అనివేటి మండపం నిర్మిస్తున్నా.. అమ్మవారికి రూ.కోట్ల విలువజేసే ఆస్తులున్నా నిర్వహణకు పైసా ఆదాయం లేని దుస్థితి. ఆలయంలో మా ఆధిపత్యం కొనసాగాలి... మా కనుసన్నల్లోనే భక్తులు పూజలు చేసుకువెళ్లాలి.. అన్నరీతిలో అర్చకులు వ్యవహరిస్తున్నారు. వారి తీరుపట్ల భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పట్టణం నడిబొడ్డున అమ్మవారికి సుమారు1.5 ఎకరాలు ఉండగా, అందులో ఆలయ నిర్మాణం పోను ప్రధాన రహదారికి అభిముఖంగా 25 వాణిజ్య దుకాణాలు నడుస్తున్నాయి. వాటి నుంచి రూపాయి కూడా ఆదాయం రావటంలేదు. గతంలో వేలం ద్వారా కొంతకాలం సక్రమంగానే ఆదాయం వచ్చినా, ఆతర్వాత వారు అద్దెలు చెల్లించలేదు. ఆలయ పునర్నిర్మాణం కోసం ఆ దుకాణాలను పూర్తిగా తొలగించడంతో ప్రస్తుతం అమ్మవారికి ఆదాయం రావడం లేదు. ఆలయ స్వీపర్లకు కూడా సక్రమంగా జీతాలు చెల్లించలేని దుస్థితి నెలకొంది.

● వేలంలో అందరికీ అవకాశం ఇవ్వాలి

తాజాగా శాశ్వత ప్రాతిపదికన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సంకల్పించి ఈనెల 24న వేలంపాటకు ఏర్పాట్లు చేశారు. అయితే కనీసం మూడేళ్ల జీఎస్టీ ఉండాలన్న నిబంధనతోపాటు 11 ఏళ్లపాటు లీజుకు పాడుకున్నవారే షాపులు నిర్మించుకోవాలన్న షరతులతో వేలం పెడుతుండటంతో అందరూ వేలంలో పాల్గొనలేని పరిస్థితి వచ్చింది. సరైన రీతిలో రూముల నిర్మాణం జరిగితే ఏటా కనీసం రూ. 40 లక్షలు ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

● పూజారుల తీరుపై అసంతృప్తి

ప్రత్యేక పూజలు, కైంకర్యాలు మా అభీష్టం మేరకే జరిగేలా చూడాలని, ఆలయం వద్ద ఎలాంటి రూముల నిర్మాణం వద్దని ఆలయ పూజారులు, కొందరు ఆచారస్తులను కలుపుకుని దేవదాయ శాఖ కమిషనర్‌కు లేఖరాయటంపై భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి శుక్రవారం పల్లకీసేవ, అభిషేకం నిర్వహించే విషయంలో పూజారులు అడ్డంకులు సృష్టిస్తూ ఉన్నారు. భక్తులు ఒకటిచెబితే వారు మరోలా చేయటం పరిపాటిగా మారింది. ఈ స్థితిలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పూజారుల తీరుమారేలా కఠినచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఎప్పటిలాగే వారు పూజలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆదమరిస్తే.. ఆసుపత్రికే...!


పాతూరు రాజీవ్‌నగర్ వద్ద దెబ్బతిన్న సీసీ రోడ్డు

కావలిటౌన్, మే15(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని పాతూరు రాజీవ్‌నగర్ పంట కాలువ పక్కనున్న సీసీ రోడ్డు బద్దలుగా పగిలి గుంతగా ఏర్పడి ప్రమాదభరితంగా మారింది. పంట కాలువ రిటర్నింగ్ వాల్ లేనందున కాలువ అంచున సీసీ రోడ్డు కుంగిపోయి పగిలిపోయిఉండడంతో ప్రమాదం పొంచివుంది. రెండేళ్లనుంచి రోడ్డు ఇదే దుస్థితి ఉన్నా, ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. వీధి లైట్లు కూడా సరిగ్గా లేకపోవడంతో అంధకారం అలుముకుంటుంది. ప్రమాదం జరిగినప్పుడు పక్కనేఉన్న పంట కాలువలో ద్విచక్రవాహన దారులు పడి గాయాలయిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

కొలతల ప్రకారమే 'ఉపాధి'వేతనాలు



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీవో దయాసాగర్

వలేటివారిపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) ఉపాధి కూలీలకు కొలతల ప్రకారమే వేతనాలు లభించనున్నట్లు ఏపీవో దయాసాగర్ తెలిపారు. మండలంలోని శాఖవరం చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెరుగుతున్న ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లి, 10 గంటల్లోపు ఇళ్లకు వెళ్లాలన్నారు. ప్రథమచికిత్స పెట్టెలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టెంట్‌లు, తాగునీరు తదితర వసతులు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు.మస్టర్లను కచ్చితంగా వేయాలని సూచించారు. కేంద్రం అమలు చేస్తున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్ నవ్వులూరి రామకృష్ణ ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె జయప్రదం కోసం కార్మిక సదస్సు

కావలిటౌన్, మే15(ఆంధ్రజ్యోతి) ఈనెల 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేసేందుకు గురువారం స్థానిక షాదీమంజిల్‌లో కార్మిక సంఘాల సదస్సు నిర్వహించారు. సదస్సుకు సీఐటీయూ నేత వసుంధరాదేవి, ఏఐటీయూసీ నాయకులు మల్లి అంకయ్య, ఏఐఎఫ్‌టీయూ న్యూ తరఫున శ్యామల అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రధాని మోదీ కార్మిక హక్కులను కాలరాసే విధానాలు అవలంబి స్తున్నారన్నారు. కార్మికులు ఐక్యంగా పోరాడి హక్కులు కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సదస్సులో సీఐటీయూ నేత పెంచులయ్య, సీపీఐ నాయకులు నాగరాజు, శ్యామల, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పునాదులు, గోడలకే పరిమితం

● జగనన్న కాలనీల్లో పూర్తికాని ఇళ్లు ● ముళ్ల కంపలతో దర్శనమిస్తున్న లేఅవుట్లు


వలేటివారిపాలెంలో పిల్లర్లకే పరిమితమైన గృహాలు

వలేటివారిపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో ఎక్కడ చూసినా ముళ్ల కంపలు, మొండి గోడలు, పిల్లర్ల ఇనుపచువ్వలే దర్శనమిస్తున్నాయి. మండలంలోని అంకభూపాలపురం మినహా మిగిలిన అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి. ఇళ్లు పూర్తి కాకుండానే వివిధ దశలో నిర్మాణాలు నిలిచిపోయాయి. అప్పటి ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి అందించే ఆర్థిక సహాయం సరిపోకపోవడం, కట్టిన వాటికి బిల్లులు సక్రమంగా రాకపోవడంతో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేకపోయారు. గత ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 1.80 లక్షలు మంజూరు చేసింది. గృహ నిర్మాణ సామగ్రి ధరలు విపరీతంగా పెరగడంతో ప్రభుత్వం అందించే ఈ మొత్తం ఏ మాత్రం చాలకపోవడంతో అనేక మంది ఇళ్లు నిర్మించుకోలేకపోయారు. కొంత మంది పునాదులు వేసి వదిలేశారు మరికొందరు గోడలు కట్టారు. ఇంకొందరు శ్లాబు వేసి వదిలేశారు. మొత్తం మీద ఎక్కువ మంది ఇంటి నిర్మాణం పూర్తి చేయలేకపోయారు. దీంతో ఇళ్లతో కళకళలాడాల్సిన కాలనీలు ముళ్ల చెట్లు, పుట్టలతో కళావిహీనంగా కనిపిస్తున్నాయి. అంతేకాక చాలా ఇళ్ల గోడలు నెర్రెలు బారాయి. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లోని 28 గ్రామాల్లో జగనన్న లేఅవుట్‌ల్లో 1348 ప్లాట్లను ప్రభుత్వం పంపిణీ చేసింది. వాటిలో 630 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 25 ఇళ్లు మాత్రమే పూర్తయ్యా యి. అవి కూడా అంకభూపాలపురంలో 19, చిన్నఅమ్మపాలెంలో 2, కాకర్లవారిపాలెంలో 2, శామీరపాలెం ఎస్టీ కాలనీలో ఒక ఇల్లు, కళవళ్లలో ఒక ఇల్లు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్లు పిల్లర్లు, మొండి గోడలకే పరిమితమయ్యాయి. మరికొన్ని గ్రామాల్లో అసలు ఇళ్లను ప్రారంభించనేలేదు.

ఇళ్లు కట్టుకుంటే బిల్లులు ఇస్తాం

గత ప్రభుత్వంలో చాలా మంది ఇళ్లు నిర్మించుకోలేదు. పునాదులు, గోడలకే పరిమితమయ్యాయి. ప్రస్తుతం అలాంటివారు ఇళ్లు కట్టుకుంటే బిల్లులు చెల్లిస్తాం. గతంలో నిలిచిపోయిన ఇళ్లకు రూ 1.80 లక్షలతోపాటు ఎస్సీ బీసీలకు అదనంగా మరో రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలను ఈ ప్రభుత్వం అందిస్తోంది. లబ్ధి దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- నాగరాజు, హౌసింగ్ ఏఈ

234 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, మే 15(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు మొత్తం 320పొగాకు బే ళ్లను అమ్మకానికి తీసుకువచ్చారు. వేలంలో 11 కంపెనీ ప్రతినిధులు పాల్గొని 234బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-77, ఆర్ఆర్-1, సీఆర్-4, జంపింగ్‌లాట్స్-4 కారణాలతో 86బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.205, సగటు ధర రూ.246.05గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టీ. ఇసాక్‌స్వరన్‌దత్ తెలిపారు.

అత్యాధునిక వసతులతో వీఆర్ హైస్కూల్

నెల్లూరు(విద్య), మే 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఆర్ ఉన్నత పాఠశాలను నిరుపేద విద్యార్థుల కోసం అత్యాధునిక వసతులతో సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని వీఆర్ హైస్కూల్ ఆధునీకీకరణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. వీఆర్ హైస్కూల్‌ను పునరుద్ధరిస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఏడాదికి వెయ్యి మంది చొప్పున ఐదేళ్లకు ఐదువేల మంది పిల్లలకు అడ్మిషన్స్ కల్పిస్తామన్నారు.

వచ్చామా.. వెళ్లామా.. అనేది కాదు
రోడ్లపై చెత్త కనిపించకూడదు


మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటరీ కార్యదర్శులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి, మే15(ఆంధ్రజ్యోతి) శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు సమయానికి డ్యూటీకి వచ్చామా ... వెళ్లమా... అనేది కాదు ...రోడ్లపై చెత్త కనిపించకుండా చూడాల్సిన బాధ్యత మీపై ఉందని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ అన్నారు. కమిషనర్ చాంబరులో గురువారం సాయంత్రం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులతో ఆయన పారిశుధ్యం మెరుగుదలపై సమీక్ష నిర్వహించారు. ట్రంకు రోడ్డులో నిత్యం చిమ్ముతూ చెత్త ఎత్తుతున్నా మళ్లీ రోడ్డుపై చెత్త కనిపిస్తూనే ఉంటుందని, మీరు అసలు ఏమి చేస్తున్నారని కమిషనర్ ప్రశ్నించారు. రోడ్లపై తిరుగుతూ చెత్తను ఎత్తిన తర్వాత రోడ్లపై ఎవరు వేస్తున్నారో గుర్తించి వారు చెత్త వేయకుండా చైతన్యం తీసుకురావాలన్నారు. పలు పర్యాయాలు చెప్పినా వారు చెత్త వేస్తుంటే అలాంటి వారిపై జరిమానాలు విధించి చర్యలు తీసుకోవాలన్నారు. ట్రంకు రోడ్డుపై చెత్త కనిపించకుండా చేసేందుకు ట్రంకురోడ్డును 7 విభాగాలుగా విభజించి 7 టీమ్‌లను వేశారు. ట్రంకు రోడ్డు తోపాటు దానికి అనుబంధంగా ఉన్న రోడ్లలో కూడా పారిశుద్య బాధ్యతలను ఆ టీమ్‌లకు అప్పగించారు. అలాగే రోడ్ల మీద నిషేధిత పాస్టిక్ కూడా కనిపించ కుండా చూడాలన్నారు. రోడ్లపై చెత్త కనిపిస్తే ఇక మీపై చర్యలు తీసుకోవాల్సి వస్తోందని హెచ్చరించారు.

కావలి మండల సమావేశం మళ్లీ వాయిదా


సమావేశానికి హాజరైన ఎంపీపీ, ఇన్‌చార్జి ఎంపీడీవో

కావలి రూరల్, మే15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆలూరు కొండమ్మ అధ్యక్షతన గురువారం జరగాల్సిన సాధారణ సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ మినహా ఎమ్పీటీసీ లు హాజరు కాలేదు. దీంతో కోరం లేక మండల సమావేశం మళ్లీ వాయిదా పడింది. మండలంలోని 17 పంచాయతీలకు గాను 16 మంది ఎమ్పీటీసీలు ఉండగా, మండల గ్రాంటులో కొంతైనా తమకు కేటాయించకుండా అధికార పార్టీ నాయకుల చేత ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీదేవి పనులు చేయిస్తున్నందున ఈనెల 6న, 15న జరిగిన మండల సమావేశానికి రాకుండా బాయ్‌కాట్ చేసినట్లు ఎమ్పీటీసీలు పేర్కొన్నారు.

● అధికారపార్టీ నేతలతో పనులు

మండల గ్రాంటులో కొంత మీకు కేటాయిస్తామని చెబుతూ సమావేశానికి వచ్చినప్పుడు మాచేత సంతకాలు చేయిస్తూ, పనులు మాత్రం అధికార పార్టీ వారికి అప్పగిస్తున్నారని ఎమ్పీటీసీ గంగన్నగారి యాదగిరి తెలిపారు. అందువల్ల సమావేశాన్ని బాయ్‌కాట్ చేయాల్సి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని ఎమ్పీటీసీలంతా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఆయన పేర్కొన్నారు.

టీడీపీ నేత ఇంటూరి రాజేష్ జన్మదిన వేడుకలు


కేకు కట్‌చేసి జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న ఇంటూరి రాజేష్

కందుకూరు, మే 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ జన్మదిన వేడుకలను గురువారం ఆయన స్వగ్రామమైన బడేవారిపాలెంలో ఘనంగా నిర్వహించారు. పలువురు టీడీపీ కార్యకర్తలు, వివిధ గ్రామాల్లోని రాజేష్ అభిమానులు ఈ వేడుకల్లో పాల్గొని రాజేష్‌తో కేకు కట్‌చేయించారు. ఈ సందర్భంగా ఆయన అనుచరులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లోనూ రాజేష్ అనుచరులు కేకులు కట్ చేయించి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిపారు.

న్యూస్ బాక్స్

రాయితీ విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

వలేటివారిపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : పచ్చిరొట్టి విత్తనాలయిన జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో హేయంత్ భరత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ క్వింటా రూ. 12,300, సబ్సిడీపోను రైతు చెల్లించాల్సింది రూ. 6,150లని, జనుములు క్వింటా రూ. 10,900, సబ్సిడీపోను రూ.5450, పిల్లిపెసర క్వింటా రూ. 18 వేలు, సబ్సిడీ పోగా రూ.9 వేలని తెలిపారు. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, దరఖాస్తు పత్రం, మొబైల్ పోన్ తీసుకొని రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ, ఉద్యానవన సహాయకులను సంప్రదించాలని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే బుర్రా జన్మదిన వేడుకలు

లింగసముద్రం, మే 15 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ జన్మదిన వేడుకలను గురువారం వైసీపీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. లింగసముద్రంలోని వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు నోటి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ పెన్నా కృష్ణయ్య కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.అలాగే పులిహోర పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ షఫీ, చీమల శ్రీనివాసులు, జీ. చిన చెంచురామయ్య, వంటేల శ్రీనివాసులు, మందా కొండయ్య, మట్లే వేణుగోపాల్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోండి

కొండాపురం, మే15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఇళ్ల స్థలంలేని వారికి ప్రభుత్వం మంజూరు చేయనున్నట్లు ఎంపీడీవో ఆదినారాయణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ఇళ్ల స్థలం లేని వ్యక్తులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తదితర వివరాలతో స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తుందని ఆయన తెలిపారు.

గడ్డివామి దగ్ధం

దగదర్తి (బిట్రగుంట), మే 15 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం ఉలవపాళ్ల పంచాయతీ చినసంఘానికి చలంచర్ల ప్రభుదాస్‌కు చెందిన గడ్డివామి దగ్ధమైంది. బాధితుడి కథనం మేరకు, బుధవారం రాత్రి 9.30 గంటలకు గుర్తు తెలియని వ్యక్తులు మూడు ఎకరాల గడ్డివామి తగులపెట్టడంతో పెద్ద మంటలు చెలరేగాయని తెలిపారు. కూలిపనులతోపటు పశువుల పాడితో అప్పులు తీర్చుకుంటూ, కుటుంబాన్ని పోషించుకుంటున్నానని అన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేస్తున్నారు.

ప్రహరీగోడ కూల్చివేత : విద్యార్థులకు పొంచి ఉన్న ప్రమాదం

వలేటివారిపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లె ఎంపీయూపీ స్కూల్ ముందున్న ప్రహరీగోడను హైవే నిర్మాణ పనుల్లో భాగంగా కూల్చివేశారు. దాన్ని కూల్చివేసి ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకూ నిర్మించలేదు. దీంతో స్కూల్ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. శింగరాయికొండ నుంచి మాలకొండ వరకు చేపట్టిన నేషనల్‌హైవేలో ఈ నాలుగు నెలల్లో జరిగిన ప్రమాదాల్లో 19 మందికి పైగానే మృత్యువాత పడ్డారు పదుల సంఖ్యలో క్షతగాత్రులయ్యారు. అయ్యవారిపల్లె బస్టాండు సెంటరు హైవేలో ఇద్దరు మృతి చెందారు. అలాంటిది ప్రహరీగోడ లేకపోతే విద్యార్థులకు ఏ క్షణంలోనైనా ప్రమాదాలు పొంచి ఉన్నాయి. పాటశాల విరామ సమయంలో ప్రహరీగోడ లేకపోతే విద్యార్థులు ఆదమరిచి హైవే రోడ్డుపైకి వచ్చే అవకాశం ఉంది. ఆ సమయంలో వేగంగా వెళ్తున్న వాహనాల నుంచి ప్రమాదాల ముప్పు ఉంది గతంలో పాఠశాలకు ప్రహరీగోడ, గేట్ ఉండేది. అప్పుడు టీచర్లు గేట్‌కు తాళం వేసేవారు. విద్యార్థులు రోడ్డుపైకి వచ్చే అవకాశం లేదు. అంతేకాకుండా పాఠశాల తూర్పు వైపున ఉన్న ప్రహరీగోడ వర్షాలకు కూలిపోయింది. పాఠశాల ఎదురుగా ప్రహరీగోడ లేకపోవడంతో హైవేపై వేగంగా వెళ్తున్న వాహనాలు పాఠశాలలోకి దూసుకుపోయి ఘోర ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అయినా అటు హైవే అధికారులు కానీ, ఇటు విద్యాశాఖ అధికారులు కానీ పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రహరీగోడను నిర్మించాలని తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రహరీ గోడ నిర్మిస్తామన్నారు!

నేషనల్‌హైవే పనులు పూర్తికాగానే ప్రహరీగోడ నిర్మిస్తామన్నారు వాళ్లు చెప్పి కూడ ఏడాదైంది. ఎప్పుడు అడిగినా అదిగో... ఇదిగో... అంటున్నారు. ప్రహరీగోడ లేకపోతే విద్యార్థులకు ప్రమాదాలు పొంచి ఉన్న సంగతి వాస్తవమే. పాఠశాలకు తూర్పు వైపున ఉన్న ప్రహరీగోడకు ఇంజనీరింగ్ అధికారులతో ప్రతిపాదనలు పంపించాం.

- మల్లికార్జునరావు, ఎంఈవో-2

రైల్వే కేబుల్‌లైను ఏర్పాటుతో ఇబ్బందులే..!


రైల్వే కేబుల్ లైను ఏర్పాటు కోసం కాలువ తవ్వుతున్న కూలీలు

బిట్రగుంట, మే 15 (ఆంధ్రజ్యోతి): పురాతన చెన్నకేశవస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డులో రైల్వే కేబుల్ లైన్ వేస్తే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు పేర్కొన్నారు. బోగోలు కుమ్మరవీధి రైల్వే ఎల్సీ గేట్ 143 వద్ద నుంచి చెన్నకేశవస్వామి ఆలయానికి వెళ్లే దారిలో రైల్వే కేబుల్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. స్వామివారి ఆలయానికే కాకుండా మంచినీటిబావికి, గంగమ్మగుడికి వెళ్లే ప్రధానరోడ్డు ఇదే కావడంతో కేబుల్ లైన్ వేస్తే సీసీ రోడ్డు ఏర్పాటుకు ఇబ్బందికరంగా మారుతుందని అంటున్నారు. అంతేకాక గామస్థులు కర్మ, క్రతువులు చేసుకునేందుకు వెళ్లే మార్గం కూడా ఇదే కాబట్టి నిత్యం జనసంచారం ఉంటుందని తెలిపారు. రైల్వే ట్రాక్‌కు తూర్పు వైపున ఇదివరకు ఏర్పాటు చేసిన కేబుల్, పైప్‌లైన్లతోపాటు ప్రస్తుతం వేస్తున్న సిగ్నల్ కేబుల్‌లైను ఏర్పాటు చేస్తే మంచిదని వారంటున్నారు. రైల్వే ఉన్నతాధికారులు స్థానికుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఆలోచించాలంటున్నారు.

ఏం జరుగుతోంది?

ముక్కంటి ఆలయ పరిసరాల్లో వరుసగా అనుమానాస్పద మరణాలు

ఒంటరి వ్యక్తులే హతమవుతున్న వైనం

వాళ్లంతా ఒంటరి వ్యక్తులు. అర్ధరాత్రి వేళ అసువులు బాస్తున్నారు. ఇలా.. శ్రీకాళహస్తీశ్వరాలయ పరిసరాల్లో రెండు వారాల వ్యవధిలో నలుగురు మృతిచెందారు. అనుమానాస్పద స్థితిలో మరణాలుగా కేసులు నమోదయ్యాయి. ఈ సీరియల్ ఘటనల వెనుక ఏం జరుగుతోందని భక్తులు ఆందోళన చెందుతున్నారు.

\- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



ముక్కంటి ఆలయం బ్రహ్మగుడి ప్రాంగణంలో రాధాకృష్ణ మృతదేహం



2022 ఆగస్టు 4న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

పంచభూత లింగాల్లో పరమశివుడు శ్రీకాళహస్తిలో వాయు లింగేశ్వరుడిగా కొలువయ్యారు. ఈ క్షేత్రంలో రాత్రి బస చేసి స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకుంటే ముక్తి లభిస్తుందని భక్తులు భావిస్తుంటారు. రాహుకేతు సర్పదోష నివారణ పూజలకు ప్రసిద్ధి చెందిన క్షేత్రం కావడంతో దేశంతో పాటు విదేశాల నుంచీ భక్తులు పెద్దఎత్తున శ్రీకాళహస్తికి విచ్చేస్తున్నారు. సుమారు మూడేళ్ల కిందట ముక్కంటి ఆలయ పరిసరాల్లో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు ముఠాగా ఏర్పడి దోపిడీ దొంగలుగా చెలరేగిపోయారు. అర్ధరాత్రి వేళ ఆలయ పరిసరాల్లో ఒంటరిగా సంచరించే వ్యక్తులపై దాడులకు తెగబడ్డాడు. అప్పట్లో వరుసగా జరిగిన పలు ఘటనలను ప్రస్తావిస్తూ 2022 ఆగస్టు 4న 'రెచ్చిపోతున్న దోపిడీ దొంగలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. అప్పటి వన్‌టౌన్ సీఐ అంజుయాదవ్ సిబ్బందితో కలిసి అర్ధరాత్రి వేళల్లో గస్తీ నిర్వహించారు. ముగ్గురు దోపిడీ దొంగలను అరెస్టు చేశారు. ఆ తర్వాత దోపిడీ ఘటనలు జరగలేదు. ఇటీవల రెండు వారాల నుంచి ముక్కంటి ఆలయ పరిసరాల్లో ఒంటరి వ్యక్తులు అనుమానాస్పద రీతిలో చనిపోతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. కాగా, ఈ నెల 12న ఆలయంలో రాధాకృష్ణ మృతదేహం వెలుగు చూసిన రోజున ఎస్పీ హర్షవర్ధన్‌రాజు వరుస మరణాలపై ఆరా తీసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అంతలోనే గుర్తు తెలియని వ్యక్తి హత్య వెలుగు చూడటంతో.. వీటిపై ఎస్పీ ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సమాచారం.

అనుమానాలెన్నో?

రెండు వారాలు.. నాలుగు వరుస ఘటనల్లో అనుమానించదగ్గ విషయాలు చాలానే ఉన్నాయి. నాలుగు మరణాలూ రాత్రివేళల్లో జరిగాయి. అందరూ ఒంటరి వ్యక్తులే. అన్నీ ఆలయ పరిసరాల్లోనే జరిగాయి.

ఇవీ ఘటనలు

- ఈ నెల 2న ఆలయ రెండో గేటు వద్ద గుర్తు తెలియని యువకుడు తీవ్ర గాయాలతో శవమయ్యాడు. పక్కనే ముక్కంటి ఆలయ సెక్యూరిటీ విభాగంకార్యాలయం ఉన్నప్పటికీ రాత్రి నుంచి మరుసటిరోజు ఉదయం వరకు మృతదేహాన్ని ఎవరూ గుర్తించలేదు.
- తొట్టంబేడు మండలానికి చెందిన ఓ గిరిజన యువకుడు ఈ నెల 5న ముక్కటి ఆలయ మూడో గేటు ఎదురుగా ఉన్న స్వర్ణముఖి నదిలో అనుమానాస్పద స్థితిలో శవమై తేలాడు.
- ఈ నెల 11వ తేదీ రాత్రి సత్యవేడు మండలానికి చెందిన రాధాకృష్ణ(41) ముక్కంటి ఆలయ ఆవరణంలోని బ్రహగుడి ప్రాంగణంలో పోలీస్‌అవుట్‌పోస్టు వెనుక బల్లపై నిద్రించాడు. మరుసటిరోజు ఉదయం ముఖంపై తీవ్రగాయాలతో మృతిచెంది ఉన్నాడు. ఇటు ఆలయ సెక్యూరిటీ, ఎస్పీఎఫ్, పోలీసు అవుట్‌పోస్టు విభాగం ఎవరూ మరుసటి రోజు ఉదయం వరకు అతడి మృతదేహాన్ని గమనించకపోవడం విమర్శలకు తావిచ్చింది.
- తాజాగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి కూతవేటు దూరంలోని నీలకంఠేశ్వరాలయ రోడ్డు శ్మశాన వాటికలో గుర్తు తెలియని యువకుడు దారుణంగా హతమైన ఘటన బుధవారం వెలుగు చూసింది. కత్తితోపొడిచి చంపినట్లు పోలీసులు నిర్ధారించారు.

టీచర్ల ఖాళీల తుది జాబితాపై కసరత్తు చేస్తున్న విద్యాశాఖ సిబ్బంది



ఉపాధ్యాయ ఖాళీలు ఏడు వేలు

- ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన బదిలీలకు రంగం సిద్ధం
- కొలిక్కి వచ్చిన హేతుబద్ధీకరణ ప్రక్రియ
- తుది గణాంకాలు లెక్కగడుతున్న విద్యాశాఖ

చిత్తూరు సెంట్రల్, మే 15 (ఆంధ్రజ్యోతి):బడుల పునర్వ్యవస్థీకరణ, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ప్రక్రియలు పూర్తయిన నేపథ్యంలో టీచర్ల బదిలీలు చేపట్టేందుకు విద్యాశాఖ సిద్ధమైంది.ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన నిర్వహించే బదిలీలకోసం చేపట్టిన ఖాళీల గుర్తింపు ప్రక్రియ కొలిక్కి వచ్చింది. తుది గణాంకాలను విద్యాశాఖ అధికారులు లెక్కలు కడుతున్నారు. ఏ ఒక్క పోస్టూ బ్లాక్ చేయకుండా, ఖాళీలు చూపేందుకు చర్యలు చేపట్టారు.మొత్తం 66 మండలాలకు సంబంధించి ఏడు వేల ఉపాధ్యాయ ఖాళీలు చూపనున్నారు. బదిలీ ప్రక్రియలో భాగంగా పాఠశాల, మండల, డివిజన్, జిల్లా స్థాయుల్లో క్యాడర్లవారీగా ఖాళీలను గుర్తించడంతోపాటు మరణించిన, వీఆర్ఎస్ తీసుకున్న, రిటైరైన ఉపాధ్యాయుల స్థానాలు, ఐదేళ్ల పూర్తి చేసుకున్న హెచ్ఎం, 8 ఏళ్ల పూర్తి చేసుకున్న టీచర్ల స్థానాలు, స్టడీ సెలవులపై వెళ్లిన ఉపాధ్యాయుల ఖాళీలు, పోక్సో కేసులు నమోదు కావడంతో వెళ్లిన వారి స్థానాలను క్లియర్ వేకెన్సీలుగా చూపనున్నారు. ఇప్పటికే 37 విభాగాల్లో టీచర్లు పనిచేస్తున్న చోట్ల ఉన్న 1918 వాటిని క్లియర్ వేకెన్సీలుగా చూపించారు. వీటితో పాటు మరో 5,082 ఖాళీలు చూపనున్నారు. ఒకే పాఠశాలలో ఐదేళ్లు పూర్తి చేసిన హెచ్ఎంలు, 8 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీ కానున్న నేపథ్యంలో వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుని ఖాళీల జాబితాను సిద్ధం చేశారు. 5/8 ఏళ్లపాటు ఒకే చోట పనిచేసిన టీచర్ల ఖాళీలు 3వేలుండగా, మిగులు (సర్‌ప్లస్) కింద 500, స్కూల్ కొత్త పోస్టులు (రీఅపోర్షన్), ఒక యాజమాన్య పాఠశాల నుంచి మరో యాజమాన్య పాఠశాలకు వెళ్లిన (షిఫ్టెడ్) ఖాళీలు 1,582 చూపుతున్నారు.

ఖాళీలు వివరాలు

యాజమాన్యం	మంజూరైన పోస్టులు	పనిచేస్తున్న టీచర్లు	ఖాళీలు
ప్రభుత్వ	723	598	125
ఎంపీ/జడ్పీ	15,552	13,969	1583
మున్సిపల్ కార్పొరేషన్	589	454	135
మున్సిపాలిటీ	508	433	75
5/8 ఒకే చోట పనిచేసిన స్థానాలు	--	--	3000
మిగులు ఖాళీలు (సరప్లస్)	--	--	500
రీఅపోర్షన్/ షిఫ్టెడ్	--	--	1582
	17,372	15,454	7000

స్థానిక సంస్థలకు నిధులు కేటాయించండి



సమావేశంలో మాట్లాడుతున్న సౌమ్య కాంతి ఘోష్

తిరుపతి(కలెక్టరేట్), మే 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, అభివృద్ధికి నిధులు కేటాయించాలని గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధులు 16వ ఆర్థిక సంఘం సభ్యులు సౌమ్య కాంతి ఘోష్‌ను కోరారు. గురువారం తాజ్ హోటల్లో పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల అభివృద్ధి పనుల్లో భాగంగా శానిటేషన్, రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ తదితర అంశాలపై సమీక్షించారు. స్థానిక సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనులు చేపడుతున్నామని, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రహదారుల నిర్మాణం, రవాణా, వీధి దీపాలు, మురుగునీటి పారుదల వ్యవస్థ, గ్రీన్ అంబాసిడర్ల వేతనాల కోసం నిధులు కేటాయించేలా చూడాలని కోరారు. టైడ్, అన్‌టైడ్ నిధులను వేర్వేరుగా కాకుండా ఒకే మొత్తంలో కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సూచనలు, అభిప్రాయాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని సౌమ్య కంతి ఘోష్ తెలిపారు. సమావేశంలో ఆర్థిక సంఘం జాయింట్ సెక్రటరీ ఎస్.గౌతమ్ అల్లాడ, సీ అండ్ డీఎండీ డైరెక్టర్ సంపత్ కుమార్, పీఆర్ అండ్ ఆర్‌డీ అడిషనల్ కమిషనర్ ఎం.సుధాకర్‌రావు, కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు పాల్గొన్నారు.

తీరిన జీవకోన దాహార్తి

- అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా కార్యక్రమంతో పరిష్కారం
- జేఎంసీ ట్రస్టు తరపున రెండు ఆర్వో ప్లాంట్లు ప్రారంభించిన ఎమ్మెల్యే ఆరణి





తిరుపతి(జీవకోన), మే 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని జీవకోన దాహార్తి తీరింది. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆధ్వర్యంలో మూడు నెలల కిందట జీవకోనలో చేపట్టిన 'అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా..' సదస్సులో ప్రజలు నివేదించిన పలు సమస్యలకు పరిష్కార చర్యలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా దాహార్తి తీర్చేందుకు సొంత నిధులతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని నాడు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ ప్రకారం.. ఆయనకు సంబంధించిన జేఎంసీ ట్రస్టు ఆధ్వర్యంలో రెండు ఆర్వో ప్లాంట్లను గురువారం ప్రారంభించారు. ప్రధానంగా సమస్య ఉన్న జీవ లింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో, మరొకటి రాజీవ్‌గాంధీ కాలనీలో ప్రారంభించారు. గురువారం జీవకోనలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జన్మదిన వేడుకలు నిర్వహించారు. దీనికి హాజరైన ఎమ్మెల్యే.. వాటర్‌ప్లాంట్‌లను ప్రారంభించారు. 'మూడు నెలల క్రితం ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో ప్రజలతో మమేకం కావడం జరిగింది. అందులో భాగంగా ఈ ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశా. జీవకోన పరిధిలోని ఆరు డివిజన్లలోనూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం. నీటి సమస్యతో పాటు స్థానికంగా ఉన్న పలు సమస్యలను మా దృష్టికి తీసుకొచ్చారు. త్వరలో రోడ్లు, కాలువల సమస్యను పరిష్కరిస్తాం' అని మీడియా సమావేశంలో ఎమ్మెల్యే చెప్పారు. జన్మదినం సందర్భంగా చిన్నారులకు పుస్తకాలు, పెన్సిళ్లు పంచిపెట్టారు. కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరణి శివ, ఆరణి జగన్, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, టీడీపీ నేత అన్నా రామకృష్ణ, కార్పొరేటర్లు అన్నా అనిత, అన్నా సంధ్య, ఎస్‌కే బాబు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, రాజారెడ్డి, భాను చౌదరి, యువరాజులురెడ్డి, స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఈసెట్‌లో 93.52శాతం పాస్

తిరుపతి(విద్య), మే15 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ రెండో ఏడాదిలో ప్రవేశానికి ఈనెల6న నిర్వహించిన ఏపీఈసెట్ ఫలితాలను ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. జిల్లాలో 1837మంది పరీక్ష రాయగా 1718 మంది (93.52శాతం) విద్యార్థులు పాసయ్యారు. పరీక్ష రాసిన 1837 మందిలో బాలురు 1321, బాలికలు 516 మంది ఉన్నారు. వీరిలో 1217 మంది బాలురు (92.13శాతం), 501మంది బాలిక (97.09 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

19 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

తిరుపతి(విద్య), మే 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 19 నుంచి 28వ తేది వరకు జరిగే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 6,256 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరికి 31 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయని డీఈవో కేవీఎన్ కుమార్ వెల్లడించారు. ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు 19 నుంచి 24వ తేదీ వరకు జరుగనున్నాయి.

ఆ రికార్డులు అప్పగించండి

- నేతిగుట్టపల్లి, అవులపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లపై విజిలెన్సు విచారణకు అడుగులు

తిరుపతి(నేరవిభాగం), మే 15(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గ పరిధిలోని నేతిగుట్టవారి పల్లి, ఆవులపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లలో జరిగిన అవినీతి అక్రమాలపై విజిలెన్సు విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. దీంతో వీటి రికార్డులను తక్షణం తమకు సమర్పించాలని కోరుతూ విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఇరిగేషన్ ఎస్‌ఈకి లేఖ రాశారు. ఈ రికార్డులు అందాక విచారణ అధికారులు.. ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆ రెండు రిజర్వాయర్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించనున్నారు. ఎంత మేరకు పనులు జరిగాయి? ఎంత ఖర్చు పెట్టారు? దీనివల్ల ప్రజలకు, రైతులకు ఎంత వరకు ప్రయోజనం చేకూరుతుంది అనే కోణాల్లో విచారించనున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు నేతిగుట్టపల్లె రిజర్వాయర్‌కు సంబంధించి రూ.717 కోట్లు, ఆవులపల్లికి సంబంధించి రూ.660 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ రెండు పనులను మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత కంపెనీ చేపట్టింది. నేతిగుట్టపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో దాదాపు 89.9 శాతం పనులు పూర్తి కావడంతో ఇక్కడే అధిక మొత్తంలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో విజిలెన్సు అధికారులు దీనిపైనే ఎక్కువగా దృష్టి కేంద్రీకరించనున్నారు. ఇప్పటి వరకు జరిగిన పనుల్లో 30 నుంచి 40 శాతం వరకు పనులు చేయకనే ఎం-బుక్కులు సిద్ధం చేసి నిధులు స్వాహా చేశారనే విమర్శలూ ఉన్నాయి. ఈ క్రమంలో జరిగిన పనుల విలువ ఎంత? ఎం-బుక్కుల్లో ఎంత చూపారనే దానిపైనా విచారించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు. ఈ విచారణను నెల రోజుల్లో పూర్తిచేసేందుకు విజజలెన్సు అధికారులు చర్యలు చేపట్టారు.

రెండు కోట్ల ఉద్యోగాలెప్పుడు?

- ప్రధాని మోదీకి సీపీఐ ప్రధాన కార్యదర్శి రాజా సూటి ప్రశ్న
- తిరుపతిలో ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు ప్రారంభం



నేతల సంఘీభావం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం రెండు కోట్ల ఉద్యోగాల భర్తీ ఎప్పుడు చేపడతారంటూ ప్రధాని నరేంద్రమోదీని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా సూటిగా ప్రశ్నించారు. తిరుపతిలో గురువారం సాయంత్రం జరిగిన అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ మహాసభల్లో ఆయన ప్రసంగించారు. ఈ హామీ నెరవేర్చి ఉంటే యువతకు ఉపాధి దక్కేదన్నారు. కేంద్రం తీరువల్ల డిగ్రీ పట్టాలు తీసుకొని కోట్లాది మంది యువత రోడ్డుపై పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా భగత్‌సింగ్ జాబ్ గ్యారెంటీ యాక్ట్‌ను అమలు చేయాలని డిమాండు చేశారు. దీనికి యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వరంగ సంస్థలను ఆదానీ, అంబానీలకు ప్రధాని ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీపై యువత సమరశీల పోరాటానికి సిద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పిలుపునిచ్చారు. 'ప్రతిపక్షాలు, నక్సలైట్లతో కాకుండా, బీజేపీ రాజకీయ విధానాలవల్లే రాజ్యాంగానికి నష్టం కలిగే ప్రమాదం ఉంది. న్యాయ వ్యవస్థను శాసించే స్థాయికి రాష్ట్రపతి వచ్చారంటే, బీజేపీ విధానాలు ఎంత ప్రమాదకరంగా మారాయో అర్థం చేసుకోవచ్చు. కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడపడానికి ప్రయత్నిస్తోంది. వీటిని మార్చడానికి యువత పోరాడాలి' అని కోరారు. మత సామరస్యాన్ని కాపాడుకోవడం ద్వారా మన దేశాన్ని రక్షించుకునే బాధ్యత యువతదేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ భృతిని అమలు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను.. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. మన దేశం చేపట్టిన సైనిక చర్యకూ మతం రంగు పూశారంటూ ఎంపీ సంతోష్‌కుమార్ విమర్శించారు. మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టే చర్యలను యువత అడ్డుకోవాలన్నారు. రెండు కోట్ల ఉద్యోగాలిస్తామన్న మోదీ.. రెండు లక్షల ఉద్యోగాలూ భర్తీ చేయలేదని ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షులు సికిందర్‌సింగ్ ఎద్దేవా చేశారు. విద్య, ఉపాధి హక్కుల అమలుకు యువత ఉద్యమించాల్సిన అవసరముందని ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమల రామన్ అభిప్రాయపడ్డారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ మహాసభల్లో యువత సమస్యలపై చర్చించి, ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్రబాబు, లెనిన్‌బాబు ప్రకటించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హరినాథరెడ్డి, గుజ్జుల ఈశ్వరయ్య, నాయకులు వల్లీ ఉల్లా ఖాద్రి, ఖాదర్, సిన్హా, దినేష్, ప్రతాప్, వివిధ రాష్ట్రాలకు చెందిన యువత పాల్గొన్నారు.

ఆలోచింపచేసిన కళా ప్రదర్శన

ప్రజా నాట్య మండలి కళాకారులు నిర్వహించిన కళా ప్రదర్శన యువతను ఆలోచింప చేసింది. సినీ గాయకుడు వందేమాతరం శ్రీనివాస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రజా నాట్య మండలి ఏపీ, తెలంగాణ కార్యదర్శులు పల్లె నరసింహ, చిన్నం పెంచలయ్య అనేక పాటలతో యువతలో చైతన్యం కలిగించారు. చంద్రానాయక్ పాడిన కమ్యూనిస్టు అమరుల గేయం ఆకట్టుకుంది.



కాలినడక మార్గంలో పట్టుబడిన పాము

అలిపిరి నుంచి తిరుమలకు చేరుకునే కాలినడకమార్గంలోని ఏడోమైలు వద్ద గురువారం సుమారు ఏడు అడుగుల పొడవైన జెర్రిపోతు పాము పట్టుబడింది. ఆంజనేయస్వామి విగ్రహానికి సమీపంలోని జనరేటర్ గదిలోకి జెర్రిపోతు పాము ప్రవేశించడాన్ని సిబ్బంది గుర్తించి పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన చేరుకుని పామును చాకచక్యంగా పట్టుకున్నాడు. అనంతరం దట్టమైన అడవిలో విడిచిపెట్టారు.

\- తిరుమల, ఆంధ్రజ్యోతి

విల్లుపురం-తిరుపతి ఎక్స్‌ప్రెస్ పాక్షిక రద్దు

మరమ్మతుల కారణంగా విల్లుపురం-తిరుపతి మధ్య నడుపుతున్న ఎక్స్‌ప్రెస్ రైళ్ల సేవలు పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. ఈ మేరకు తిరుచ్చి రైల్వే డివిజన్ కార్యాలయం గురువారం విడుదల చేసిన ప్రకటనలో... దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో గుంతకల్ డివిజన్ పరిధిలో పలు విభాగాల్లో మరమ్మతులు జరుగుతున్నాయని, అందువల్ల విల్లుపురం-తిరుపతి మధ్య నడుపుతున్న రైలు వేళల్లో మార్పు చేసినట్లు తెలిపింది. విల్లుపురం నుంచి ఉదయం 5.40 గంటలకు బయల్దేరే ఎక్స్‌ప్రెస్ ఈ నెల 18,20,21,22,25,27,28,29, జూన్ 1,3 తేదీల్లో తిరుపతికి బదులు కాట్పాడి వరకు మాత్రమే నడుస్తుంది. అలాగే, మరుమార్గంలో తిరుపతి నుంచి మధ్యాహ్నం 1.40 గంటలకు విల్లుపురం వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతికి బదులు కాట్పాడి నుంచి బయల్దేరుతుందని అధికారులు తెలిపారు.

\- ప్యారీస్, ఆంధ్రజ్యోతి

గరుడ వారధికి లోడ్ టెస్ట్

తిరుపతిలోని గరుడ వారధికి ఇటీవల జరిగిన మరమ్మతుల నేపథ్యంలో లోడ్ టెస్ట్ చేయనున్నారు. రామానుజ సర్కిల్ నుంచి శ్రీనివాసం వరకు.. శుక్రవారం నుంచి 21వ తేది వరకు 'స్పాన్ లోడ్ టెస్ట్' ఉంటుంది. ఆ సమయంలో రాకపోకలను నిలిపివేస్తున్నట్టు కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. కపిలతీర్థం నుంచి వచ్చే వాహనాలు శ్రీనివాసం కాంప్లెక్స్ వరకు వారధిపై రావచ్చని, అదేవిధంగా మార్కెట్ యార్డు టూ రేణిగుంటకు రాకపోకలు చేయవచ్చని పేర్కొన్నారు.

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ నారాయణగిరి షెడ్ల వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.27 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 74,020

తలనీలాలు సమర్పించినవారు: 29,361



కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లోనూ చదవాలనే పేద పిల్లల ఆకాంక్షను నెరవేర్చాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 428 కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఇందుకోసం 25 శాతం సీట్లు కేటాయించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈక్రమంలో 1వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. వీరి ఫీజుల మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. అయినప్పటికీ మూడేళ్లుగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న వారి సంఖ్య తక్కువగానే ఉంటోంది. ప్రచారం,అవగాహనారాహిత్యమే ఇందుకు కారణమని ప్రభుత్వం గుర్తించింది. ఈక్రమంలోనే ఈసారి దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలని విద్యాశాఖాధికారులను ఆదేశించింది.

\- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

గతంలో ప్రవేశాలు పొందిన వారు

సంవత్సరం	అడ్మిషన్ల సంఖ్య
1. 2022	57
2. 2023	1002
3. 2024	97





పేద విద్యార్థులకు ఉచిత కార్పొరేట్ విద్య

ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లు

1వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రభుత్వమే ఫీజుల చెల్లింపు

వీరు అర్హులు: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద కుటుంబాల పిల్లలు అర్హులు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారయితే కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలలోపు పట్టణ ప్రాంతాలయితే రూ.1.44 లక్షలలోపు ఉండాలి. పాఠశాల నుంచి మూడు కిలోమీటర్ల లోపు దూరంలో ఉన్నవారే దరఖాస్తు చేసుకోవాలి. ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల్లో చేరదలచుకున్న పిల్లలకు ఈ ఏడాది మార్చి 31 నాటికి ఐదేళ్ల వయసు నిండాలి. స్టేట్ సిలబస్ పాటశాలల్లో చేరేవారికి మే 31 నాటికి ఐదేళ్లు నిండాలి.

■ అడ్మిషన్లకు ఎంపిక

దరఖాస్తులను ఈనెల 20 నుంచి 24 వరకు పరిశీలిస్తారు. 29న లాటరీ విధానంలో ఎంపిక చేసి మొదటి జాబితాను ప్రకటిస్తారు. వీరి ప్రవేశాలను జూన్ 8న నిర్ధారిస్తారు. జూన్ 11న లాటరీ ద్వారా రెండో దశ జాబితాను కూడా ప్రకటిస్తారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాల్లో ఉచితంగా చేరవచ్చు.

■ సీట్ల కేటాయింపు ఇలా ఉంటుంది

దివ్యాంగులు, హెచ్ఐవీ బాధితులు, అనాథలకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, సూచించిన పరిమితి లోపు ఆదాయం ఉన్న బలహీన వర్గాల పిల్లలకు 6 శాతం సీట్లను కేటాయిస్తారు. ఆయా రిజర్వేషన్లలో పిల్లలు లేకపోతే ఆ సీట్లను ఇతరులకు కేటాయిస్తారు. సందేహాలకు, సమాచారం కోసం టోల్‌ఫ్రీ నంబరు 1800 425 8599లో సంప్రదించవచ్చు.

దరఖాస్తు విధానం

దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. అర్హులైన విద్యార్థులు ఈ నెల 19వ తేదీలోపు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ https://cse.ap.gov.in/ ద్వారా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు ప్రస్తుత చిరునామా ధ్రువీకరణకు ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్‌కార్డు, భూమి హక్కుల పత్రం, ఉపాధి హామీ జాబ్‌కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, విద్యుత్ బిల్లు, అద్దె ఒప్పంద పత్రాల్లో ఏదేని ఒకటి సమర్పించాల్సి ఉంటుంది. బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరి.

తిరుపతి ఐఐటీకి మహర్దశ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు, మే 15(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2,313 కోట్లతో తిరుపతి ఐఐటీకి మహర్దశ రానుందని ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణచెప్పారు. ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో గురువారం ఆయన ఇతర అధికారులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఐఐటీకి 2015లో ప్రభుత్వం 549 ఎకరాలు ఇచ్చిందన్నారు. మొదటి విడతగా కేంద్రం ఇచ్చిన రూ.1,444 కోట్లతో 1,200 మంది విద్యార్థులకు సౌకర్యాలు కల్పించామన్నారు. ఇప్పుడు రెండో విడత కింద అభివృద్ధి చేయడానికి కేంద్రం 2,313 కోట్లను మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ నిధులతో నాలుగేళ్ల కాల వ్యవధిలో 6,500మంది విద్యార్థులకు సౌకర్యంగా తరగతి గదులు, హాస్టల్ భవనాలు, ల్యాబ్ మొదలగు వసతులను ఏర్పాటు చేస్తామన్నారు. 12వేలమంది విద్యార్థులకు వసతులు కల్పించడానికి మాస్టర్‌ప్లాన్‌ను సిద్ధం చేసినట్లు వివరించారు. రెండో విడత కింద.. నాలుగేళ్ల వ్యవధిలో ఎంతెంత ఖర్చు చేయనున్నారు? ఏయే వసతులు కల్పించనున్నారనే వివరాలను ఆయన వెల్లడించారు. ఇలా ఫేజ్ 1, ఫేజ్ 2 కింద నిర్మాణాలను పూర్తిచేసి రానున్న రోజుల్లో 12వేలమంది విద్యార్థులకు సౌకర్యంగా ఐఐటీని తీర్చిదిద్ది అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లనున్నట్లు డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. కియా మోటార్, టాటా కంపెనీలు, అమరరాజా, నవయుగ కన్‌స్ట్రక్షన్స్‌తోపాటు మరిన్ని కంపెనీలతో కలిసి తిరుపతి ఐఐటీ పనిచేస్తోందన్నారు. నాలుగేళ్ల పాటు తిరుపతి ఐఐటీలో కియా మోటార్స్ రూ.35కోట్లతో ఇంజనీరింగ్ ఎక్సలెన్సును పెంపొందించడం, కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ఇంజనీరింగ్ రంగాల్లో భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రతిభను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుని ఒప్పందాన్ని కుదుర్చుకుని పనిచేస్తోందన్నారు. ఈ ఎంవోయూలో విద్యార్థుల కోసం ప్రీ ప్లేస్‌మెంట్, ఆఫర్లతో అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఎంటెక్ విద్యార్థులకు ప్రత్యేకంగా కియా ఇండియా స్కాలర్‌షిప్ రూపంలో ఆర్థిక సాయం అందిస్తామని ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ చెప్పారు.

వీడిన చిన్నారి హత్యాచారం కేసు మిస్టరీ

● 17 నెలల తర్వాత పట్టుబడిన నిందితుడు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్

చంద్రగిరి, మే 15(ఆంధ్రజ్యోతి): దాదాపు ఏడాదిన్నర క్రితం జరిగిన మైనర్ బాలిక హత్యాచారం కేసు మిస్టరీ వీడింది. నిందితుడిని ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం డీఎస్పీ ప్రసాద్ విలేకర్ల సమావేశంలో వెల్లడించిన వివరాలివి.. 2023 డిసెంబరులో చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లె జగనన్న కాలనీలో సిమెంటు ఇటుకల తయారీకి జార్ఖండ్ నుంచి కొంతమంది కార్మికులు వచ్చారు. ఈక్రమంలో గతేడాది జనవరి 3న ఈ కార్మికుల్లో ఒకరి కుమార్తె (6) ఇటుకల బట్టీ వద్ద ఆడుకుంటోంది. తర్వాత కనిపించలేదు. దీంతో తల్లిదండ్రులు పరిసరాల్లో గాలించారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమతో వచ్చిన బాల్ కిషోర్ ఖిర్వార్‌ను బాధిత బాలిక తల్లిదండ్రులు అనుమానించారు. అతడిని కొట్టి పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారించి బాల్‌కిషోర్‌ను విడిచిపెట్టారు. తర్వాత అతడు కుటుంబ సభ్యులతో కలిసి పరారయ్యాడు. తప్పిపోయిన బాలిక మృతదేహం నాలుగు రోజుల తర్వాత జగనన్న కాలనీ సమీపంలో అటవీ ప్రాంతంలో బయటపడింది. పోలీసుల నిర్లక్ష్యం వల్లే బాల్‌కిషోర్ చేతిలో బాలిక హత్యకు గురైందంటూ అప్పట్లో బాధితురాలి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేశారు. పోలీసులు తొలుత అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక హత్య కేసుగా నమోదు చేశారు. అప్పటి నుంచి నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో ఇటీవల కేసు దర్యాప్తు వేగవంతం చేశారు. 17 నెలల తరువాత గురువారం తిరుపతి రైల్వే స్టేషన్ సమీపంలో బాల్ కిషోర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. చిన్నారికి తినుబండారాలిచ్చి అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాక హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. ఇతడ్ని కోర్టుకు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐలు రవీంద్రనాయక్, అనిత, సిబ్బంది మునిరత్నం, పురంధర్, గోపి, లోకనాథం తదితరులు పాల్గొన్నారు. కేసును ఛేదించిన ఎస్ఐలు రవీంద్రనాయక్, అనిత, సిబ్బంది మునిరత్నం, పురంధర్, గోపి, లోకనాథంలకు డీఎస్పీ ప్రసాద్, సీఐ సుబ్బరామిరెడ్డి చేతుల మీదుగా రివార్డులను అందజేశారు.



పోలీసుల అదుపులో నిందితులు - స్వాధీనం చేసుకున్న గంజాయి

24.5 కిలోల గంజాయి స్వాధీనం

● ఇద్దరు పశ్చిమబెంగాల్ మహిళల అరెస్టు

రేణిగుంట, మే 15 (ఆంధ్రజ్యోతి): రేణిగుంటలోని ఓ లాడ్జీలో 24.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి తెలిపారు. రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ లాడ్జిలో గదిని పోలీసులు తనిఖీలు చేశారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన మామోని మండల్, నమిత మండల్ సూట్‌కేసులను చూడగా.. 24.5 కేజీల గంజాయి ఉంది. దీనిని స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేశారు. ఒడిశాలో గంజాయి కొని కేరళకు తరలించే క్రమంలో ఇక్కడి గదిలో దిగారు. గంజాయి తరలింపులో కీలకంగా వ్యవహరిస్తున్న ఇద్దరు అంతర్రాష్ట గంజాయి స్మగ్లర్లను అరెస్టు చేయాల్సి ఉంది' అని ఏఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ అరుణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

11 మంది ఎక్సైజ్ కానిస్టేబుళ్లకు పదోన్నతులు



పదోన్నతి పొందిన వారిని అభినందిస్తున్న యూనియన్ నాయకులు

తిరుపతి(నేరవిభాగం), మే 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని 11మంది ఎక్సైజ్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లగా పదోన్నతి కల్పిస్తూ చిత్తూరు ఎక్సైజ్ ఈఎస్, నోడల్ అధికారి శ్రీనివాసులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందిన వారిలో వి.కోట చెక్‌పోస్టులో పనిచేస్తున్న సి.రామన్, కె.ప్రభాకర్(చీకలబైలు), బి.హిదయతుల్లా (ఈఎస్ కంట్రోలు రూమ్), రమేష్‌బాబు (ఏసీ డిస్టిలరీలు), వి.లోకేష్ (రామసముద్రం సీపీ), ఇస్మాయిల్ (పలమనేరు), వైకుంఠరావు (కేటల్‌ఫారం), ప్రవీణ్‌కుమార్ (ఏసీ ఎన్‌ఫోర్సుమెంటు), ఉమామహేశ్వర (పీలేరు), శ్రీనివాస్ (చిత్తూరు), మధుసూదనరెడ్డి (మదనపల్లె) ఉన్నారు. పదోన్నతులు పొందిన వారిని జిల్లా ఎక్సైజ్ కానిస్టేబుళ్ల సంఘం అధ్యక్షుడు ఎస్.రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ యాదవ్, ఉపాధ్యక్షుడు హరిప్రసాద్, గౌరవాధ్యక్షుడు ధర్మయ్య, ప్రెస్ కార్యదర్శి రమేష్ అభినందించారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ నిర్వహణ భేష్

పరిశీలించిన 16వ ఆర్థిక కమిషన్ బృందం



వేస్ట్ మేనేజ్‌మెంట్ వివరాలు తెలుసుకుంటున్న ఆర్థిక కమిషన్ సభ్యులు

తిరుపతి/రేణిగుంట, మే15(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తూకివాకంలో నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ బాగుందని 16వ ఆర్థిక కమిషన్ సభ్యులు సౌమ్య కాంతి ఘోష్ అన్నారు. గురువారం ప్లాంట్ (చెత్త నుండి సంపద కేంద్రం)ను కలెక్టర్ వెంకటేశ్వర్, కార్పొరేషన్ కమిషనర్ మౌర్యతో కలిసి కమిషన్ సభ్యులు సౌమ్య కాంతి ఘోష్, కార్యదర్శి గౌతమ్ అల్లాడ పరిశీలించారు. ప్లాంట్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ, కంపోస్టు తయారీ, బయో మెథనైజేషన్ ప్లాంట్, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ తదితర యూనిట్ల గురించి కలెక్టర్, కమిషనర్ మౌర్య వివరించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు తదితరాలను ప్రాసెసింగ్ చేసి సిమెంట్ ఫ్యాక్టరీలకు విక్రయిస్తారని, తడి చెత్తను కంపోస్టు ఎరువుగా మార్చి రైతులకు, ఉద్యానవనాలకు విక్రయిస్తారని, ఇక మార్కెట్ నుంచి వెలువడే, హోటల్స్ నుంచి సేకరించే వ్యర్థాల ద్వారా వంట గ్యాస్ ఉత్పత్తి చేసి విక్రయిస్తున్నట్లు వివరించారు. భవన నిర్మాణ వ్యర్థాలను ఆరు రకాలుగా గుల్ల, ఇసుకగా మారుస్తారని, దాంతో పేవర్స్ తయారు చేస్తారని తెలిపారు. ట్రీటెడ్ వేస్ట్ నీటిని పరిశ్రమలకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, లైజన్ అధికారులు పాల్గొన్నారు.



ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



ప్రత్యేకాలంకరణలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి, మే 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మేథో గురుదక్షిణామూర్తికి గురువారం గురుపేచి సందర్భంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేశారు. అనంతరం వినాయక పూజల కలశ పూజ వైదిక క్రతువులు నిర్వహించారు. దక్షిణామూర్తికి అభిషేకం చేశాక, విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయ కుమార్‌నాయుడు, చెంచయ్యనాయుడు, ప్రధానార్చకులు కరుణాకరన్ గురుకుల్, వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కురుగొండలో ఎమ్మెల్యే పల్లెనిద్ర

● అభివృద్ధి పనులను ప్రారంభించిన నెలవల విజయశ్రీ



అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

ఓజిలి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కురుగొండలో గురువారం రాత్రి సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పల్లె నిద్ర చేశారు. గ్రామాల్లో పరిస్థితి, ప్రభుత్వం పట్ల ప్రజలకున్న అభిప్రాయాలను తెలుసుకునేందుకు పల్లెనిద్ర చేయాలని ప్రజా ప్రతినిధులను, అధికారులకు ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు సూళ్లూరుపేట నియోజకవర్గంలో మొట్టమొదటి పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.50 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, రూ.40 లక్షలతో చేపట్టిన జలజీవన్ మిషన్, మినీ గోకులం షెడ్లను ప్రారంభించారు. అనంతరం ర్యాలీగా సభావేదిక వద్దకు చేరుకున్నారు. ఇది సీఎం చంద్రబాబు ఆశీస్సులతో దక్కిన ప్రజా విజయమని.. తాను ప్రజాసేవకే అంకితమవుతానని పేర్కొన్నారు. తనను గెలిపించిన ప్రజలకు సేవ చేస్తూ వారి రుణం తీర్చుకుంటానన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికే సీసీ రోడ్లు తాగునీరు, డ్రైనేజి వ్యవస్థ తదితర సదుపాయాలను కల్పించామని వెల్లడించారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మీ, ఎంఈవో-2 చంద్రశేఖర్, ఏవో విజయలక్ష్మి, ఓజిలి, పెళ్లకూరు మండలాల పార్టీ అధ్యక్షులు విజయ్‌కుమార్‌నాయుడు, సంచి కృష్ణయ్య, నేతలు శ్రీనివాసులురెడ్డి, నిరంజన్, పాడి వెంకటసుబ్బయ్య, ఎస్‌కే ఖలీల్, గున్నం మధుసూదన్‌రెడ్డి, కనుమూరు గోపాల్‌రెడ్డి, దారా అంకయ్య, కంకణాల సత్యవరప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల అత్యుత్సాహంతో జనాలకు ఇక్కట్లు

ఎమ్మెల్యే పల్లెనిద్ర సందర్భంగా కొందరు అధికారుల అత్యుత్సాహం జనాలను ఇబ్బంది పెట్టించింది. కురుగొండలో వేదిక ఏర్పాట్లు చేపట్టారు. దీంతో మధ్యాహ్నం నుంచే గ్రామంలోకి రాకపోకలను ఆపేసి బ్యారికేడ్లు అడ్డుపెట్టారు. దీంతో కురుగొండ మీదుగా గునపాటిపాళెం, గునపాడు, మెట్టు గ్రామాలకు వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడ్డారు. టీడీపీ పాలనలో ఎప్పుడూ లేనివిధంగా ఇలా ఎమ్మెల్యే కార్యక్రమానికి రాకపోకలను ఆపేయడం ఏమిటని స్థానికులు తెలిపారు. బస్సులు, ఆటోలు బయటే తిరిగాయి. ద్విచక్ర వాహనదారులు మాత్రం సందుగొందుల్లో గ్రామంలోకి వెళ్లారు. ఈ పరిణామం పట్ల స్థానిక తెలుగుదేశం శ్రేణులు విస్మయం వ్యక్తంచేశాయి. ఇకనైనా అధికారులు ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా ప్రభుత్వ కార్యక్రమాలు కొనసాగించాల్సిన అవసరం ఉంది.



గ్రామంలోకి వెళ్లకుండా బ్యారికేడ్లు అడ్డం పెట్టడంతో ఆగిన ద్విచక్ర వాహనదారులు

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

చెట్లను నరికి విద్యుత్ లైన్ వేస్తారా?



సిద్దిగుంటపాళెం రోడ్డు పక్కన చెట్ల మధ్యలో విద్యుత్ తీగలు వెళ్లేలా నాటిన స్తంభాలు

వాకాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): వాకాడు, చిట్టమూరు, కోట మండలాల్లో 1999-2000 మధ్య అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 'పచ్చని చెట్లే.. ప్రగతికి మెట్లు' అనే నినాదంతో సోషల్ ఫారెస్టు అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా రోడ్లకు ఇరువైపులా తురాయి, నమిలినారా, సాయోడియా, కానుగ, వేప, రావి మొక్కలు నాటించింది. ఇప్పుడవి పెరిగి పెద్దవై వాహనదారులకు, పాదచారులకు నీడనిస్తున్నాయి. ఇదిలా ఉండగా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి కేంద్ర ప్రభుత్వం రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ ప్రవేశపెట్టింది. దీని ద్వారా ఇళ్లకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటుతో పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా, అంతరాయాల తగ్గింపు తదితర సేవలు అందిస్తారు. ఇందులో భాగంగా వాకాడు, వాలమేడు, కొండూరు, దుగరాజపట్నం సబ్‌స్టేషన్ల నుంచి గ్రామాలకు కొత్తగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా రోడ్లకు ఇరువైపులా చెట్ల మీదుగా లైన్లు వేసేలా స్థంభాలు నాటారు. ఆయా స్తంభాల నుంచి విద్యుత్ తీగలు లాగాలంటే చెట్లను నరికి తొలగించాల్సిందే. రోడ్ల పక్కన నాటిన స్థంభాలను చూసిన ప్రజలు విద్యుత్‌శాఖ అధికారుల తీరు పట్ల విమర్శలు గుప్పిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని ప్రభుత్వం చెబుతుంటే విద్యుత్‌శాఖ అధికారులేమో పాతికేళ్లు పెరిగి పెద్దవైన చెట్లను నరికేసి లైన్లు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చేనేతలను ఆదుకుంటాం: మంత్రి సవిత



చేనేత చీరలను పరిశీలిస్తున్న మంత్రి సవిత

వెంకటగిరి టౌన్, మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేనేతలకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని చేనేత శాఖ మంత్రి సవిత అన్నారు. గురువారం విజయవాడలో జరిగిన రాష్ట్ర చేనేత సంఘాల ప్రతినిధుల సమావేశంలో వెంకటగిరికి చెందిన పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్, మహేశ్వరి హ్యాండ్లూమ్ వీవర్స్ కోపరేటివ్ సొసైటీ చీఫ్ ప్రమోటర్ శ్రీరామదాసు గంగాధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో చేనేతలను రోడ్డుపాలు చేసిందన్నారు. చేనేతలు అప్పులపాలై దుర్భర జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి సవిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేనేతలకు ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నారని, త్వరలోనే వాటిని నెరవేర్చేందుకు ఆయా శాఖల అధికారులు, మంత్రులతో సమీక్షించారని చెప్పారు. అనంతరం వెంకటగిరి చీరలను మంత్రి పరిశీలించారు.

జీవనోపాధులపై పర్యవేక్షణ ఉండాలి



పొదుపు సంఘాల సమస్యలను అధికారులకు వివరిస్తున్న సీసీ ప్రసాద్

కోట, మే 15 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల మహిళలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని జీవనోపాధులకు బాటలు వేసుకుంటున్నారా లేదా అన్న విషయమై పర్యవేక్షణ ఉండాలని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ మురళి అన్నారు. కోటలోని వెలుగు కార్యాలయంలో గురువారం బ్యాంక్ లింకేజ్ రుణాలపై వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో 1150 పొదుపు సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఆ రుణాలను సద్వినియోగం చేసుకుని జీవనోపాధులకు బాటలు వేసుకోవడంపై ఆరా తీయాలన్నారు. మెరుగ్గా ఉన్న గ్రూపులకు మరింత ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. రుణాలను సకాలంలో చెల్లించేలా పొదుపు సంఘాలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వీవోఏలపై ఉందన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో వెలుగు పరిశీలకుడు చంద్రబాబు, ఏపీఎం అనీల, సీసీలు ప్రసాద్, శ్రీకాంత్, భాస్కర్, శంకరయ్య, బిందు, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రప్రభ వాహనంపై కరిమాణిక్యస్వామి



నాయుడుపేట టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - తుమ్మూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామివార్లకు చప్పర ఉత్సవం నిర్వహించారు. రాత్రి కరిమాణిక్యస్వామి చంద్రప్రభ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై చెన్నకేశవస్వామి



గూడూరు అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కర్నాల వీధిలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి సూర్యప్రభ వాహనంపై, రాత్రి చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులుస్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు కోసం సర్వే

చిల్లకూరు, మే15(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు కోసం సర్వే నిర్వహించడం జరుగుతోందని ఐఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం చిల్లకూరులో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లలిత, నాగరాజు పాల్గొన్నారు.

పాఠశాల భవనంపై నుంచి పడి విద్యార్థికి గాయాలు

సూళ్లూరుపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని షార్ ఉద్యోగుల కాలనీలో ఉన్న అంతరిక్ష కేంద్రీయ పాఠశాల భవనంపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడిన విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. పాఠశాలలో ఈనెల 5 నుంచి వేసవి తరగతులు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం 9:45 - 10:00 మధ్య విరామ సమయంలో కొందరు విద్యార్థులు పాఠశాల మూడో అంతస్తు పైకి వెళ్లారు. పదో తరగతి చదువున్న ఆశ్రిత్ ఆలీ ప్రమాదవశాస్తు భవనంపై నుంచి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే సతీష్ ధావన్ మెమోరియల్ షార్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తీసుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు పాఠశాలకు వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

చెరువుల్లో మత్స్య సంపద జాడేదీ?



కోట మండలం కొండుగుంట చెరువులో తగ్గిన నీరు

కోట, మే 15(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురిసినప్పటికీ మత్స్య సంపద దాదాపుగా పడిపోయింది. గత రెండేళ్లతో పోల్చుకుంటే ఈ ఏడాది కొన్ని మేజర్ చెరువులు తప్ప మిగిలిన చెరువుల్లో మత్స్యసంపద కానరాక పోవడంతో ఆయా గ్రామాల ప్రజల ఆశలు తలకిందులయ్యాయి. కోట మండలంలో 45 చెరువులు ఉన్నాయి. పెన్నక్క చెరువుతో పాటు మరో రెండు మేజర్ చెరువులను మినహాయిస్తే దాదాపు అన్ని చెరువుల్లో ఈ ఏడాది పుష్కలంగా వర్షపునీరు చేరింది. ప్రధానంగా మే నెలలో చెరువుల్లో నీటిమట్టం తగ్గడంతో స్థానిక ప్రజలు చేపలు పట్టడం ప్రారంభిస్తారు. అయితే చెరువుల్లో నీరు తగ్గుముఖం పట్టగా, కొన్ని చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. అయినా మత్స్య సంపద జాడ లేకపోవడంతో ఆయా పరిసర గ్రామాల ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని కొండుగుంట, కేశవరం, రాఘవాపురం, మద్దాలి, చిట్టేడు, ఊనుగుంటపాళెం, చెందోడు, పుచ్చలపల్లి, వంజివాక, అల్లంపాడు, కర్లపూడి, ఉత్తమనెల్లూరు చెరువుల్లో మొదట్లో చేపలు బాగా కనిపించాయి. తీరా నీటిమట్ట తగ్గి చేపలు పట్టేందుకు ఆయా గ్రామాల ప్రజలు సన్నద్ధమవుతున్న సమయానికి మత్స్య సంపద జాడ కానరాక పోవడంతో ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

శ్మశాన స్థలం ఆక్రమణపై గిరిజనుల నిరసన



తహసీల్దారు విజయలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

బాలాయపల్లి, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నూరు గ్రామంలో గిరిజనుల శ్మశాన స్థలాన్ని అదే గ్రామానికి చెందిన జడపల్లి రమణయ్య ఆక్రమించాడంటూ గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి మృతదేహాలను ఖననం చేసే శ్మశాన స్థలాన్ని రమణయ్య ఆక్రమించాడని, ఆదేమిటని ప్రశ్నిస్తే దౌర్జన్యానికి పాల్పడుతున్నారని వాపోయారు. ఇదే స్థలంలో కొంత భూమిని గతంలో ఆక్రమించి సాగు చేస్తున్నాడన్నారు. ఇప్పుడు మిగిలిన భూమిని కూడా ఆక్రమించి కంచె వేశారని చెప్పారు. అనంతరం సర్పంచు అర్చన సంతకంతో కూడిన వినతిపత్రాం తహసీల్దార్ విజయలక్ష్మికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మురళీమోహన్ రెడ్డి, గిరిజనులు పాల్గొన్నారు.

రేపు చెన్నై సెంట్రల్ - సూళ్లూరుపేట మధ్య
సబర్బన్ రైళ్ల రద్దు

పెరంబూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్ - గూడూరు మార్గంలోని పొన్నేరి - కవరపేట మధ్య మరమ్మతుల కారణంగా శనివారం 21 సబర్బన్ రైళ్లు రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- చెన్నై సెంట్రల్ నుంచి ఉదయం 10.30, 11.35, మధ్యాహ్నం 1.40 గంటలకు గుమ్మిడిపూండి వెళ్లే సబర్బన్ రైళ్లను రద్దు చేశారు. అలాగే, గుమ్మిడిపూండి నుంచి మధ్యాహ్నం 1, 3.45 గంటలకు చెన్నై సెంట్రల్‌కు వెళ్లే రైళ్లను రద్దు చేశారు.
- చెన్నై సెంట్రల్ నుంచి ఉదయం 5.40, 10.15, మధ్యాహ్నం 12.10 గంటలకు సూళ్లూరుపేట వెళ్లే సబర్బన్ రైళ్లను రద్దు చేశారు. అలాగే, సూళ్లూరుపేట నుంచి మధ్యాహ్నం 12.35, 1.15, 3.10 గంటలకు చెన్నై సెంట్రల్ వెళ్లే రైళ్లను రద్దు చేశారు.
- చెన్నై బీచ్ నుంచి మధ్యాహ్నం 12.40, 2.40 గంటలకు గుమ్మిడిపూండి వెళ్లే రైళ్లను రద్దు చేశారు. అలాగే, గుమ్మిడిపూండి నుంచి మధ్యాహ్నం 2.30, 3.15, సాయంత్రం 4 గంటలకు చెన్నై బీచ్‌కు వెళ్లే రైళ్లను రద్దు చేశారు.
- సూళ్లూరుపేట నుంచి ఉదయం 8.10 గంటలకు నెల్లూరు వెళ్లే మెము రైలు, నెల్లూరు నుంచి ఉదయం 1.20 గంటలకు సూళ్లూరుపేటకు వెళ్లే రైళ్లను రద్దు చేశారు. అలాగే, ఆవడి నుంచి ఉదయం 4.25 గంటలకు చెన్నై సెంట్రల్ వెళ్లే సబర్బన్ రైలును రద్దు చేశారు.

ప్రత్యేక రైళ్లు

సబర్బన్ రైళ్లను రద్దు చేసిన నేపథ్యంలో, ప్రయాణికుల సౌకార్యర్థం ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. ఆ ప్రకారం, పొన్నేరి నుంచి మధ్యాహ్నం 1.18 గంటలకు చెన్నై సెంట్రల్, పొన్నేరి నుంచి సాయంత్రం 4.47 గంటలకు చెన్నై బీచ్, చెన్నై సెంట్రల్ నుంచి ఉదయం 10.30 గంటలకు పొన్నేరి, చెన్నై సెంట్రల్ నుంచి ఉదయం 11.15, మధ్యాహ్నం 1.40, చెన్నై బీచ్ నుంచి మధ్యాహ్నం 2.40 గంటలకు పొన్నేరి, మీంజూరు నుంచి మధ్యాహ్నం 3, 4.14 గంటలకు చెన్నై సెంట్రల్, చెన్నై బీచ్ నుంచి మధ్యాహ్నం 12.40 గంటలకు ఎన్నూర్, ఎన్నూర్ నుంచి చెన్నై సెంట్రల్‌కు మధ్యాహ్నం 3.56 గంటలకు ప్రత్యేక సబర్బన్ రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

ఉన్నోళ్లకే 'సహకారం'!

- డీసీసీబీలో రూ.150 కోట్ల మొండి బకాయిలు
- నాటి వైసీపీ పెద్దల ఒత్తిళ్లతో ఎడాపెడా రుణాలు

నెల్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): నాటి వైసీపీ పెద్దల అత్యుత్సాహం.. క్షేత్రస్థాయి అధికారుల అవినీతి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌కు(డీసీసీబీ) మచ్చ తెచ్చిపెట్టింది. మొండి బకాయిల రూపంలో రూ.150 కోట్ల మేర నష్టపోయే పరిస్థితి దాపురించింది. మైక్రో ఫైనాన్స్ పేరుతో డ్వాక్రా సంఘాలకు విరివిగా రుణాలు ఇప్పించాలని గత వైసీపీ ప్రభుత్వం చూపిన అత్యుత్సాహం అవినీతిపరులైన ఉద్యోగులకు వరంగా మారింది. దీనికి తోడు వ్యవసాయ రుణాలూ సుమారు రూ.80 కోట్ల వరకు మొండి బకాయిలుగా మిగిలిపోయాయి. ఇందులో రూ.40 కోట్లు తిరిగి రావని నిర్ధారించుకొని నిరర్థక ఆస్తులుగా గుర్తించింది. ఉన్నతాధికారులు, పాలకవర్గ సభ్యులు పట్టించుకోకుంటే మిగిలిన రూ.110 కోట్లు కూడా నిరర్థక ఆస్తుల జాబితాలోకి చేరిపోతాయి. నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో 24 బ్రాంచీలు ఉన్నాయి. ఏటా రూ.1800 కోట్ల వరకు రైతులకు రుణాల రూపంలో ఇస్తున్నారు. ఇంత సామర్థ్యం కలిగిన బ్యాంకును కొందరు అవినీతిపరులు కొల్లగొట్టేస్తున్నారు.

వ్యవసాయ మొండి బకాయిలు

నాయుడుపేట నియోజకవర్గ పరిధిలోని చిట్టమూరు సొసైటీలో రూ.30 కోట్ల వరకు మొండి బకాయిలు ఉన్నాయి. ఉదయగిరి పరిధిలోని కమ్మపాలెం సొసైటీ రూ.11 కోట్లు, వింజమూరు పరిధిలోని కుడుములదిన్నె సొసైటీ రూ.7కోట్లు, వెంకటగిరి సొసైటీ రూ.11 కోట్లు, ఉదయగిరి మండలం కమ్మవారిపాలెం సొసైటీ రూ.8 కోట్లు.. ఇలా డీసీసీబీ పరిధిలోని పలు సొసైటీలన్నింటిలో కలిసి సుమారు 80 కోట్ల వరకు మొండి బకాయిలు పేరుకుపోయాయి. వీటిలో సుమారు రూ.40 కోట్ల వరకు ఇక రావని నిర్ధారించుకొని నిరర్థక ఆస్తులుగా ప్రకటించారు. ఇందులో బినామీ పేర్లతో నాయకులు, సిబ్బంది తీసుకున్న రుణాలూ ఉన్నాయి. వీటిని వసూలు చేయాలనే తాపత్రయం డీసీసీబీ యంత్రాంగంలో కనిపించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

మైక్రో ఫైనాన్స్ రుణాల పేరుతో..

డ్వాక్రా మహిళలకు భారీగా రుణాలు ఇవ్వాలనే ఉద్దేశంతో గత వైసీపీ ప్రభుత్వం డీసీసీబీలపై తీసుకొచ్చిన ఒత్తిడి పనిచేసే క్షేత్రస్థాయి ఉద్యోగులకు వరంగా మారింది. డ్వాక్రా మహిళల పేరు చెప్పి ఏకంగా రూ.65 కోట్లు పక్కదారి పట్టించారు. ఇందులో అన్నిస్థాయిల అధికారుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా డీసీసీబీలో భూమి కలిగిన రైతులకే రుణాలు ఇస్తారు. వారు తీసుకున్న రుణం చెల్లించని పక్షంలో భూమిని వేలం వేయడం ద్వారా రికవరీకి ఆస్కారం ఉంటుంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు, వ్యవసాయ అనుబంధ వ్యాపారాల కోసం మైక్రో ఫైనాన్స్ ఇవ్వమని డీసీసీబీలపై ఒత్తిడి తెచ్చి టార్గెట్‌లు విధించింది. దీంతో సొసైటీల పరిధిలోని కార్యదర్శులు ఎడాపెడా రుణాలు మంజూరు చేశారు. ఈ రుణాలు తిరిగి చెల్లించే పనిలేదని డ్వాక్రా మహిళలకు నచ్చజెప్పి వారి చేత సంతకాలు చేయించుకొని ఉద్యోగులే స్వాహా చేశారు. దీంతో రూ.65 కోట్లు మొండి బకాయిలుగా మిగిలిపోయి నిరర్థక రుణాల పద్దులో కలిసేందుకు సిద్ధంగా ఉన్నాయి.

డీసీసీబీపై తీవ్ర ప్రభావం

రుణాల రికవరీ శాతాన్ని బట్టే నాబార్డు డీసీసీబీలకు నిధులు విడుదల చేస్తుంది. మొండి బకాయిల మొత్తం పెరిగితే నాబార్డు నుంచే అందే నిధులు గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటివరకు కేవలం రూ.40 కోట్లు మాత్రమే నిరర్థక ఆస్తులుగా లెక్కల్లో చూపించారు. మిగిలిన 110 కోట్లను రావాల్సిన బకాయిల పద్దులో చూపించారు. ఇలా ఎంతోకాలం బకాయిల జాబితాలో చూపడం సాధ్యం కాదు. రెండు, మూడేళ్లు గడిస్తే ఇవి కూడా నిరర్థక ఆస్తుల పద్దులోకి వెళ్లిపోతాయి. అది జరిగితే డీసీసీబీకి నాబార్డు నుంచి వచ్చే నిధులు తగ్గిపోతాయి. ఫలితంగా రైతులకు ఇచ్చే రుణాలు తగ్గిపోతాయి.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి



మృతి చెందిన స్వర్ణలత

వాకాడు, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుర్గవరం అరుంధతీయవాడకు చెందిన వివాహిత స్వర్ణలత(26) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలు... కోట మండలం విద్యానగర్ ప్రకాశం కాలనీకి చెందిన స్వర్ణలత, వాకాడు మండలం దుర్గవరం అరుంధతీయవాడకు చెందిన కొండాపురం పరశురామ్ తొమ్మిదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. నాలుగేళ్లుగా పరశురామ్ భార్య స్వర్ణలతను మానసికంగా, శారీరకంగా హింసించేవాడు. బుధవారం రాత్రి స్పృహతప్పి పడిఉన్న స్వర్ణలతను కుటుంబ సభ్యులు నీళ్లుచల్లి తట్టి లేపారు. గురువారం ఉదయం స్వర్ణలతను పరశురామ్ కొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు వాకాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందింది. ఎస్‌ఐ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ రోడ్డుకు కొత్త హంగులు

సూళ్లూరుపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే రోడ్డును కొత్త హంగులతో తీర్చిదిద్దుతున్నారు. షార్ ఉద్యోగుల కాలనీ నుంచి కుదిరి గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపులా ఎక్స్‌కవేటర్ సాయంతో చెట్లను, పిచ్చి మొక్కలను తొలిగించి చదును చేస్తున్నారు. స్పీడ్ బ్రేకర్లు ఉన్న చోట రంగులు వేసి వాహనాలకు ఇబ్బందులు లేకుండా చేస్తున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పెళ్లకూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య అన్నారు. గురువారం మండలంలోని కొత్తూరు పశువైద్యశాలలో పాడి రైతులకు రాయితీపై పశువుల దాణా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ ధనుంజయ, పశువైద్యాధికారి సతీష్, టీడీపీ నాయకులు కృష్ణమ నాయుడు, ప్రసాద్‌నాయుడు, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ

సూళ్లూరుపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 50 శాతం రాయితీపై సరఫరా చేసిన పశువుల దాణాను గురువారం సూళ్లూరు పశువైద్యశాల వద్ద టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో పాడి రైతులకు పంపిణీ చేశారు. పశువైద్యాధి కారిణి వరలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు కొక్కు శంకరయ్య, తిరుపాల్, మురళీరెడ్డి, నలజాం రాము, గురుకల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ పథకానికి 20 లోగా దరఖాస్తు చేసుకోండి

వెంకటగిరిటౌన్, మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులు ఈనెల 20 లోగా దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ నాగర్జున సాగర్ తెలిపారు. రైతు విశిష్ట సంఖ్య పొందిన రైతులకే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల లబ్ధి చేకూరుతుందన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

తడ, మే 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తడకుప్పం గ్రామంలో జరిగిన చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. వరదయపాళెం మండలం చిలమత్తూరు గ్రామానికి చెందిన చిన్నిచరణ్ అలియాస్ బుద్ధా గురువారం ఉదయం తడలో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతన్ని విచారించగా మంగళవారం రాత్రి తడకుప్పం గ్రామానికి చెందిన దేశప్పన్ ఇంట్లో చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడు. అలాగే బోడిలింగాలపాడు సాయిబాబా మందిరం వద్ద బుధవారం బైక్ చోరీకి పాల్పడింది కూడా ఇతనేనని తేలింది. నిందితుడి నుంచి రెండు సవర్ల బంగారు ఆభరణాలు, 170 గ్రాముల వెండి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు.

మనమిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోండి



మనమిత్ర యాప్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో శేఖర్‌నాయక్

తడ, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేవలను సులభతరం చేసేందుకు ప్రవేశపెట్టిన మనమిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శేఖర్‌నాయక్ అన్నారు. గురువారం ఆయన తన ఎంపీడీవో కార్యాలయంలో మనమిత్ర యాప్‌ను ఆవిష్కరించారు. ప్రజలు తమకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం మనమిత్ర యాప్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొలవి రఘురెడ్డి, పంచాయతీ కార్యదర్శులు గాబ్రియల్, మస్తాన్, సురేష్, శేషారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి చేరిన పాఠ్యపుస్తకాలు

కోట, మే 15(ఆంధ్రజ్యోతి): కోట మండల విద్యావనరుల కేంద్రానికి గురువారం 24,950 పాఠ్య పుస్తకాలు చేరాయి. మండలంలోని 77 పాఠశాలల్లో 1నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు 24,950 పాఠ్య పుస్తకాలు వచ్చాయని, వాటిని హెచ్‌ఎంలకు అందజేస్తామని ఎంఈవో మస్తానయ్య తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

డక్కిలి, మే 15(ఆంధ్రజ్యోతి): డక్కిలి ఉన్నత పాఠశాలలో గురువారం చాగణం లలితమ్మ, భాస్కరరావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వరంలో తిరుపతిలోని వెంకటేశ్వర అరవింద నేత్రాలయ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 205 మంది హాజరు కాగా, అందరికీ కంటి పరీక్షలు చేశారు. 30 మందికి కళ్లద్దాలు అందజేశారు. 70 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సీఈవో సీతారామ నాయుడు, ఏవో గల్లా కృష్ణ, అరవింద నేత్రాలయ ప్రతినిధి జీవన్, వైద్యులు పాల్గొన్నారు.



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సమస్యల పరిష్కారానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

వాకాడు, మే 15(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. వాకాడులోని స్త్రీశక్తి భవనంలో ఎంపీపీ కొడవలూరు అనసూయమ్మ అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు తమ శాఖల్లో జరిగిన ప్రగతిని వివరించారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లపై చర్యలు తీసుకోవాలని కోరారు. తీరప్రాంత గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని పూడిరాయదురువు ఉపసర్పంచు బూదనం వెంకటరత్నం అన్నారు. సమావేశంలో తహసీల్దారు రామయ్య, వైస్ ఎంపీపీ వెంకటరమణయ్య, ఎంపీటీసీ నిర్మల, ఏఎంసీ మాజీ కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరంగా ర్యాలీని జయప్రదం చేయండి

వాకాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): 'దేశం కోసం మనం సైతం' నినాదంతో శుక్రవారం ఉదయం 10గంటలకు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే తిరంగా ర్యాలీని జయప్రదం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదనరెడ్డి పిలుపునిచ్చారు. వాకాడు అశోకపిల్లర్ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్ డేలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. సాయంత్రం 4 గంటలకు వాకాడులోని షాదీమంజిల్‌లో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశమవుతారని మధుసూదనరెడ్డి తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో ఆర్డీవో తనిఖీలు



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి

దొరవారిసత్రం, మే 15(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం ప్రభుత్వాస్పత్రిని సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి గురువారం తనిఖీ చేశారు. గత నెల 24న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కూడా ఆస్పత్రిని తనిఖీ చేసి వైద్యాధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తరచూ ఆస్పత్రిని తనిఖీ చేయాలని ఆర్డీవోకు కలెక్టర్ సూచించారు. ఈ నపథ్యంలో ఆర్డీవో ఆస్పత్రిని తనిఖీ చేసి వైద్యులు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. పలు సూచనలు చేశారు. అలాగే ఏకొల్లు ఎస్సీ బాలికల వసతి గృహంలో జరుగుతున్న మౌలిక వసతుల పనులను కూడా ఆర్డీవో పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దారు శైలాకుమారి ఉన్నారు.

కొనసాగుతున్న క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు

డక్కిలి, మే 15(ఆంధ్రజ్యోతి): వెంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలోని మొబైల్ వైద్య శిబిరాల్లో క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం వెలికల్లు, మోపూరు గ్రామాల్లో ప్రజలకు క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు స్థానిక వైద్యాధికారిణి బిందు ప్రియాంక తెలిపారు. ఈ నెల 19న నాగవోలు, 22న పలుగోడు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఉంటాయని, ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యురాలు పద్మావతి, వైస్‌ఎంపీపీ గడ్డం చంద్రశేఖర రెడ్డి, సర్పంచులు వెంకటరమణ, జనార్దన్, పంచాయతీ కార్యదర్శులు నరిసింహులు, సుబ్బరాయులు, డక్కిలి సిహెచ్‌వో సుకుమారి, సూపర్‌వైజర్ ఆదిలక్ష్మి, ఎంఎల్‌హెచ్ యశస్విని, ఏఎన్‌ఎంలు వైష్ణవి, వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.